

## నేడు రైల్వే జీఎం శ్రీవాస్తవ రాక

రాజమహేంద్రవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్(జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం జిల్లాకు రానున్నారు. ఉదయం తుని నుంచి 10 గంటలకు రాజమండ్రి రైల్వే స్టేషనుకు చేరుకుంటారు. అక్కడి నుంచి గోదావరి, కొవ్వూరు, నిడదవోలు రైల్వే స్టేషన్లలో తనిఖీలు నిర్వహించి మధ్యాహ్నానికి ఏలూరు వెళతారు.రానున్న పుష్కరాల నేపథ్యంలో వస్తున్నారు.

# ఒక్క రోజు తనిఖీ 193 బైక్‌ల సీజ్

- జిల్లా పోలీసుల కార్డన్ సెర్చ్
- అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు
- దాడుల్లో 225 మంది సిబ్బంది
- ధ్రువపత్రాల్లేని వాహనాలే టార్గెట్

రాజమహేంద్రవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసాంఘిక శక్తుల అణచివేత, శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ డీఎస్పీలు, సీఐల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలోని పోలీసులు బృందాలుగా ఏర్పడి అనుమానిత ప్రదేశాలకు తెల్లవారుజామునే చేరుకొని సోదాలు చేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 19 దీనిలో భాగంగా మంగళవారం త్రీటౌన్ పరిధిలోని లింగంపేటలో 31, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ శాటిలైట్ సిటీ సీ బ్లాక్‌లో 70, ధవళేశ్వరం ఐవోసీఎల్ కాలనీలో 30, గోకవరం డ్రైవర్స్ కాలనీలో 26, కొవ్వూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి ఇందిరమ్మ కాలనీలో 36 బైక్‌లు సీజ్ చేశారు. మొత్తం సరైన ధ్రువపత్రాలు లేని 193 ద్విచక్ర వాహనాలను, గోకవరంలో 5లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. అయా సోదాల్లో ఐదుగురు డీఎస్పీలు, సీఐలు 9, ఎస్ఐలు 18, పీఎస్ఐలు 7, స్పెషల్ పార్టీలు 2, శక్తి తదితర విభాగాల సిబ్బంది 184 మంది పాల్గొన్నారు. గోకవరం డ్రైవర్స్ కాలనీలో ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు.


### సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి



జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. సాధారణ జన జీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. చట్ట ఉల్లంఘనకు ప్రేరేపించే వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. సమస్యాత్మక ప్రాంతాలు, వ్యక్తులపై నిఘా పటిష్ఠం చేశాం. సోదాల్లో భాగంగా అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నిస్తు న్నాం. నాటుసారా, గంజాయి, మందుగుండు సామగ్రి, మద్యం అక్రమ నిల్వలను గుర్తించడానికి అణువణువూ నిశితంగా పరిశీలిస్తున్నాం. - ఎస్పీ నరసింహ కిషోర్



ధవళేశ్వరం, గోకవరంలో పోలీసులు సీజ్ చేసిన బైక్‌లు




# ముందడుగు!

## వచ్చే నెల ఒకటి నుంచి కొత్త బార్‌లు

**మద్యం బార్ల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలసీకి రూపకల్పన చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో 2022-25 మధ్య అమలైన మద్యం బార్‌ల పాలసీ గడువు ఆగస్టు 31వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త మద్యం బార్‌ల పాలసీ అమలుకు గ్రీన్‌సిగ్నల్ పడింది. ముందస్తుగా ఈ పాలసీ అమలుకు రాష్ట్రంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి ఆ ఉపసంఘం ఇచ్చిన అధ్యయన నివేదిక ఆధారంగా కొత్త బార్ల పాలసీ అమలుకు శ్రీకారం చుట్టనుంది.ఈ పాలసీలో భాగంగా గీత కార్మికులకు 10 శాతం షాపులు కేటాయించనున్నారు.**

(రాజమహేంద్రవరం/ అమలాపురం -ఆంధ్రజ్యోతి)

కొత్త బార్ పాలసీపై అబ్కారీ శాఖ దాదాపుగా కసరత్తు పూర్తి చేసింది.త్వరలో కొత్త బార్‌లకు నోటిఫికేషన్ వెలువడనుంది.జగన్ హయాంలో ఇచ్చిన బార్‌ల లైసెన్స్‌లకు ఈ నెలాఖరుతో కాల పరిమితి ముగుస్తుంది. దీంతో ఈ నెల 15వ తేదీలోగా కొత్త బార్‌లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది.సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్‌లు అందుబాటులోకి రానున్నాయి.మద్యం దుకాణాల కేటాయింపులో గీతకార్మికులకు ప్రభుత్వం 10 శాతం షాపులు కేటాయించింది. వీరికి లైసెన్స్ ఫీజు సైతం భారీగా తగ్గించింది. త్వరలో బార్ల లైసెన్సుల్లోను పదిశాతం కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించింది.

### దుకాణాల్లో ధరలకే

జగన్ హయాంలో బార్‌లలో ధరలను బార్లా తెరిచేశారు. అప్పటి ప్రభుత్వం ఇష్టానుసారం ధరలు పెంచుకోవచ్చని జీవో ఇవ్వడంతో అడ్డూ అదుపూ లేకుండా మందుబాబుల జేబులను గుల్ల చేశారు. వైసీపీ ప్రభుత్వం ఒకవైపు మద్యం ధరలను నూరుశాతం పెంచగా, బార్‌లలో దానిపై మరింత అదనంగా లాగేశారు. క్వార్టరుకు రూ.50-రూ.70, బీర్‌కి ఏకంగా రూ.100-రూ.120 తీసుకుంటూ దోపిడీ చేశారు. ఐదేళ్లు ఈ దందా సాగింది.ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ దోపిడీకి కొత్త మద్యం పాలసీతో అడ్డుకట్ట వేసింది. బార్‌లలో కూడా దుకాణాల్లో ధరలనే అమలు చేయాలని నిర్ణయానికి వచ్చింది. దుకాణాల కంటే 10 శాతం ఎక్కువ ధర చెల్లించి బార్‌లు ప్రభుత్వ మద్యం డిపోల నుంచి కొనుగోలు చేస్తాయి.బార్‌లలో కూడా దుకాణాల ధరే నిర్ధారిస్తే ఆ శాతాన్ని ప్రభుత్వం నష్టపో వాల్సి ఉంటుంది. దరఖాస్తు రుసుం రూ.5 లక్షలు ఉంటుందని చెబుతున్నారు.

### పర్మిట్ రూంలు కూడా

జగన్ జమానాలో పిచ్చి బ్రాండ్లతో ఎంత ఆదాయం వచ్చిందో.. ఇప్పుడు దాదాపు 200 రకాల నాణ్యమైన బ్రాండ్లు ఉన్నా అంతే రాబడి నమోదవుతోంది. బీర్లలో పెరుగుదల కనిపిస్తే ఆ మేరకు మిగతా మద్యం బ్రాండ్లలో తరుగుదల నమోదవుతోంది.దీంతో ఆదాయం ఆశాజన కంగా ఉండడం లేదు. దీనిపై ప్రభుత్వం విశ్లేషణ చేయగా పర్మిట్ రూమ్‌లు లేకపోవ డమే ఒక కారణమని తేలింది. ప్రస్తుతానికి అనధికారిక సిట్టింగ్‌లను చూసీచూడనట్టు వది లేస్తున్నా.. ఆదాయం మెరుగుపడడం లేదు.బార్‌ల లైసెన్స్‌ల మాదిరిగానే పర్మిట్ రూంలకు ఈ సెప్టెంబరు నుంచి అనుమతులిచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది.ఉమ్మడి జిల్లాలో 452 మద్యం దుకాణాలు ఉన్నాయి. 2019కి ముందు అన్ని షాపులకు ఏడాదికి రూ.5 లక్షలు ఫీజుగా ఉండేది. ఇప్పుడు దానిని రెండు కేటగిరీలుగా చేయనున్నారు.మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.7.5 లక్షలు, మిగతా ప్రాంతాల్లో రూ.5 లక్షల ఫీజు విధించే అవకాశం ఉంది. ఉమ్మడి తూర్పులో కాకినాడ,రాజమహేంద్రవరం కార్పొరేషన్లు కాగా.. మిగతావి మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు ఉన్నాయి. బార్‌లు, పర్మిట్ రూంలకు ఒకేసారి నోటిఫికేషన్ ఇస్తారా? లేదా వేర్వేరుగా విడుదల చేస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

### బార్లకు లాటరీ..

మద్యం షాపుల తరహాలోనే బార్లకు లాటరీ తీయాలని ప్రభుత్వం యోచిస్తోంది. జగన్ హయాంలో వేలం విధానంలో రెండేళ్ల పరిమితికి జారీ చేసిన లైసెన్స్‌లను గడువు ఈ నెల 31వ తేదీతో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త బార్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. లైసెన్స్ ఫీజుల నిమిత్తం రెండు ప్రతిపాదనలను ఎక్సైజ్ శాఖ సిద్ధం చేసింది. నగర పంచాయతీల్లో రూ.35 లక్షలు, మునిసిపాలిటీల్లో రూ.40 లక్షలు, నగరపాలక సంస్థల పరిధిలో రూ.45 లక్షలు మొదలు ప్రతిపాదన కాగా.. వరుసగా రూ.55 లక్షలు, రూ.65 లక్షలు, రూ.75 లక్షలు రెండో ప్రతిపాదనగా ప్రభుత్వం ముందుంచింది. అయితే ఖచ్చితంగా ఒక్కొక్క బారుకు నాలుగు దరఖాస్తులు పడాల్సిందేనన్న నిబంధన ఉంది. ప్రభుత్వం మొదటి ప్రతిపాదనకు మొగ్గు చూపుతుండగా ఆదాయం తగ్గుతుండడంతో ఏంచేయాలో ప్రశ్నార్థకంగా మారింది.ఆ అంతరాన్ని పూడ్చడానికి బార్‌ల సంఖ్య పెంచాలని భావిస్తున్నారు.ప్రస్తుతం తూర్పుగోదావరిలో 20, కాకినాడ జిల్లాలో 13, కోనసీమ జిల్లాలో 10 కలిపి మొత్తంగా 43 బార్లు ఉన్నాయి.ఈ సంఖ్య 60కి పెరిగే అవకాశం ఉంది.

- లాటరీ విధానంలో కేటాయింపు
- 10 రోజుల్లో నోటిఫికేషన్ విడుదల
- ఉమ్మడి జిల్లాలో 60 బార్లు
- దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు?
- బారుకు 4 దరఖాస్తులు తప్పనిసరి
- లైసెన్స్ ఫీజు రూ.45 లక్షలు
- మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులు
- పర్మిట్ రూంలకు అవకాశం
- ఈ నెల 31తో బార్ల గడువు ముగింపు

### నాడంతా బార్లా

కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రాష్ట్రప్రభుత్వం త్వరలో బార్ లైసెన్సుల జారీకి సిద్ధమవుతోంది. బహిరంగ వేలం ద్వారా కోట్లలో ఆదాయం వచ్చే ఛాన్స్ ఉన్నా అదేదీ కాదనుకుని లాటరీ ద్వారా బార్ల జారీకి సన్నాహాలు చేస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం బార్ల కేటాయింపులో అడ్డగోలుగా వ్యవహరించింది. భారీ అప్‌సెట్ ధరలను నిర్ణయించి వ్యాపారుల మధ్య పోటీ పెంచింది. అదేసమయంలో అప్పటి అధికారపార్టీ నేతలు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేశారు. బార్ల వ్యాపారులను సిండికేట్ చేసి వారి నుంచి తక్కువ ధరకు కోట్ చేయించి తద్వారా వారి నుంచి లాగేశారు. తద్వారా పోటీ లేకుండా తక్కువ ధరకే వైసీపీ అనుకూల వ్యాపారులు 2022 నుంచీ బార్లు నిర్వహిస్తూ భారీగా సంపాదిస్తున్నారు. గతంలో ఒక్కో బార్‌కు ప్రభుత్వం రూ.35లక్షల ప్రారంభ ధర నిర్ణయిస్తే ఏరియా ఆధారంగా వేలంలో రూ.కోటికిపైగా పలకాల్సింది.కానీ నేతలు,వ్యాపారులు సిండికేట్ అయి అప్‌సెట్ ధరకు పదిశాతం కూడా అదనంగా రాకుండా చేసి ఉమ్మడి జిల్లాలో అప్పటి వైసీపీ ప్రజా ప్రతినిధులు భారీగా సంపాదించారు. ఒక్క కాకినాడ జిల్లాలో 15 బార్లకు వేలం నిర్వహించారు.ఒక్క కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 11 బార్‌లను తక్కువ ధరకు లాగేసుకున్నారు.పోటీ పెరగకుండా ఉండేం దుకు పదకొండు బార్‌లకు పద్దెనిమంది బరిలో ఉంటే అప్పటి సిటీ ఎమ్మెల్యే ద్వారం పూడి ఏడుగురిని దారికి తెచ్చారు. వేలం నుంచి పోటీదారులను తప్పించి ఒక్కో బార్ కు రూ.35 లక్షల ప్రారంభ ధరగా ప్రభు త్వం నిర్ణయిస్తే కేవలం రెండు లక్షలే అదనం గా వేసి రూ.37లక్షలకు కోట్ చేశారు. తద్వా రా భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది.

# కడియపులంక సర్పంచ్‌గా పద్మావతి

## 2 నామినేషన్లు - ఒకరు విత్‌డ్రా - ఏకగ్రీవంగా ఎన్నిక

కడియం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కడియపులంక సర్పంచ్‌గా మాదిశెట్టి పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి, స్టేజ్ -1 రిటర్నింగ్ ఆఫీసర్, మండల విద్యాశాఖ అధికారి మణికుమార్ మంగళవారం ప్రకటించారు. ఆయన తండ్రి వార్డు సభ్యుడు మార్గాని ఏడుకొండలు, కంఠంశెట్టి సుబ్రహ్మణ్యం తదితరుల సమక్షంలో మాదిశెట్టి పద్మావతి సర్పంచ్‌గా ఎన్నికైన ధ్రువపత్రాన్ని అందుకున్నారు.సర్పంచ్ ఎన్నికల్లో కడియపులంక సర్పంచ్ స్థానం బీసీ మహిళకు కేటాయించడంతో మార్గాని అమ్మాణీ పోటీ చేసి విజయం సాధించారు. మండల జడ్పీటీసీ స్థానం బీసీ మహిళకు కేటాయించడంతో కూటమి తరపున పోటీ చేసి జడ్పీటీసీ పదవిని దక్కించుకున్నారు. అయితే రెండింటిలో ఓ పదవికి రాజీనామా చేయాలనడంతో జడ్పీటీసీ పదవికి రాజీనామా చేశారు. సర్పంచ్ పదవిలో ఉండగానే గుండెపోటుకు గురై అమ్మాణీ అకస్మాత్తుగా మృతిచెందారు. దీంతో సర్పంచ్ స్థానం ఖాళీ అయ్యింది. ఇదిలా ఉండగా ఇటీవల సర్పంచ్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 10వ తేదీన ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు అమ్మాణీ కుమార్తె మాదిశెట్టి పద్మావతి నామినేషన్, వీరి సమీప బంధువు మార్గాని సత్యవేణి మరో నామినేషన్ వేశారు. మార్గాని సత్యవేణి తన నామినేషన్ ఉపసంహరించుకోవడంతో రేసులో ఒకరే నిలిచారు. ఈ నేపథ్యంలో మాదిశెట్టి పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు.



ధ్రువీకరణపత్రం అందుకుంటున్న పద్మావతి

### అమ్మ స్థానంలోకి రావడం ఆనందం



కడియపులంక సర్పంచ్ పదవిలో ఉండగానే మా అమ్మ అమ్మాణీ మమ్మల్ని వదిలి వెళ్లి పోయారు. నా తండ్రి ప్రోత్సాహం, గ్రామస్తుల సహకారంతో నేను సర్పంచ్‌గా పోటీ చేశా. గ్రామస్తులు తిరిగి నాకు సర్పంచ్ పదవి కట్టబెట్టారు.అమ్మ స్థానంలోకి నేను రావడం ఆనందంగా ఉంది. కానీ అమ్మలేని లోటు తీరనిది. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధికి కృషి చేస్తా.

- మారిశెట్టి పద్మావతి, సర్పంచ్

## బంగారు కుటుంబాల మ్యాపింగ్‌పై సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల మ్యాపింగ్ ఆగస్టు 15వ తేదీలోపు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం చంద్రబాబు పీ-4 తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. 2028 నాటికి పేదరిక నిర్మూలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 66 వేల కుటుం బాలు లక్ష్యం కాగా 60 వేలు కుటుంబాలను గుర్తించామన్నారు.5 వేల కుటుంబాలకు మార్గదర్శకులను మ్యాపింగ్ చేశామన్నారు. మిగిలిన కుటుంబాలను ఆగస్టు 15లోగా గుర్తించి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.ఈ మేరకు బి ఫోర్ నీడ్ బెస్ట్ సర్వేను వేగంగా పూర్తి చేయాలన్నారు.ప్రతి 25 కుటుంబాలకు సచివాలయ సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో సీతారామ్మూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్, సీపీవో అప్పలకొండ, డీఎల్‌డీవో వీణాదేవి తదితరులు పాల్గొన్నారు.

### 'రండి! టీ తాగుతూ మాట్లాడుకుందాం'

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం మంగళవారం జిల్లాలో విజయవంతమైందని సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని 14 ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులు వారికి చెల్లించాల్సిన బకాయిలపై తమ సూచనలు అందించారు.




### 'నాణ్యతగా ఉంటేనే నిత్యావసరాలు ఇవ్వండి'

గోపాలపురం, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): నిత్యావసరాల సరఫరాలో నాణ్యత పాటించాలని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గణేశ్ అన్నారు. ఏఎంసీ ఆవరణలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ గోదామును మంగళవారం పరిశీలించారు. సరుకుల్లో నాణ్యత లోపిస్తే తన దృష్టికి తెచ్చి వెనక్కి పంపించాలని ఆదేశించారు. ప్రతి నెల స్టేజ్ టూ నుంచి సరుకులను 15వ తేదీ నుంచి 25వ తేదీ లోగా డీలర్ పాయింట్లకు చేర్చాలన్నారు. గోదాములో కందిపప్పు, పంచదార పరిశీలించి తొలగించాలన్నారు.

### స్మార్టుమీటర్లు వద్దు..

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : స్మార్టు మీటర్ల బిగింపు తక్షణం ఆపాలని, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు, విద్యుత్ ఛార్జీల పెంపుదలను ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జాంపేటలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట మంగళవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, నాయకులు పూర్ణిమరాజు, ఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.




దేవరపల్లి మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు మంగళవారం అట్టహాసంగా సాగింది. వేలాదిగా నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వెంట నడిచారు..అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. గోపాలపురం నియోజకవర్గం రాష్ట్రంలోనే 8వ స్థానంలో నిలిచిందని తెలిపారు.




# దేవుడి.. సేవకులు!

## ఆలయ ట్రస్ట్ బోర్డులకు గ్రీన్‌సిగ్నల్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నామినేటెడ్ పోస్టులకు కూటమి సభ్యుల నుంచి తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటి కే కొన్ని సొసైటీలకు త్రీమన్ కమిటీలను నియమించిన సంగతి తెలిసిందే.పలు మార్కెట్ కమిటీలను నియమించారు. దేవస్థాన కమిటీల జాతర మొదలైంది. జిల్లాలో పార్టీకి సేవ చేసిన నేతలు, కార్యకర్తలు ఏదో విధంగా గుర్తింపు కావాలని ఎదురు చూస్తున్నారు. వారిలో చాలా మందికి దేవాలయ ట్రస్టుబోర్డుల్లో స్థానం లభించనుంది.రాజమహేంద్రవరంలో మూడు కమిటీల నియామకం పూర్తయింది.ఈ నెలాఖరుకి ఉమ్మడి జిల్లాతో పాటు కొవ్వూరు డివిజన్ లోనూ మొత్తం కమిటీలను ప్రకటించేందుకు కసరత్తు జరుగుతుంది. ఎమ్మెల్యేలు ఇప్పటికే పార్టీల అధిష్ఠానానికి కమిటీల వారీ పేర్లను ప్రతిపాదించి పంపారు. అధిష్ఠానం పరిశీలించి అధికారికంగా ప్రకటించనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేలాది మంది తెలుగుదేశం, .జనసేన, బీజేపీ కూటమి నేతలు, కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు దక్కనున్నాయి. ఈ సారి ఎక్కువ దేవాలయాలు మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆధిపత్యంలో ఉండనున్నాయి.

### కూటమి ఏం చేస్తుందో..

గత వైసీపీ హయాంలో ఏం జరిగిందో కానీ రూ.5 లక్షల కంటే తక్కువ ఆదాయం ఉన్న దేవాలయాలకు ట్రస్టుబోర్డుల నియామకం వద్దని సుప్రీంకోర్టు ఆర్డర్ ఇచ్చింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో రూ.5లక్షల ఆదాయం కంటే తక్కువ ఆదాయం వచ్చేవి సుమారు 590 వరకూ ఉన్నాయి. అంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చేవి 37 ఉన్నాయి. ఈ రెండు కేటగిరీలనే పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని రూ. 5 లక్షల్లోపు ఆదాయం ఉన్న వాటిని పరిగణనలోకి తీసుకునేటట్టు కోర్టు నుంచి ఏమైనా ఆర్డర్ తెచ్చుకుంటే సుమారు 1713 దేవాలయాలకు కమిటీలను నియమించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం సుమారు 590 దేవాలయాలకు మాత్రం కమిటీలు వేసే ఆలోచన జరుగుతోంది. గత నెలలో సీఎం చంద్రబాబు స్వయంగా ఈ కమిటీలకు పేర్లను ప్రతిపాదించాలని ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలకు సూచించిన సంగతి తెలిసిందే.దీంతో ఇప్పటికే సందడి మొదలైంది.

### ట్రస్ట్‌బోర్డుకు 9 మంది..

ఒక్కో దేవాయలయానికి 9మంది ట్రస్ట్‌బోర్డు సభ్యులను ప్రభుత్వం నియమించనుంది. మొదట 11 మందితో నియమించాలని భావించినా ఎందుకో 9కి తగ్గించింది. ఒకరు చైర్మన్, మిగతావారు సభ్యులు ఉంటారు. దీని వల్ల వేలాది మంది కార్యకర్తలకు పదవులు దక్కనున్నాయి.ఇందులో టీడీపీకి అధికంగా, తర్వాత స్థానం జనసేనకు, మూడో స్థానం బీజేపీకి దక్కనున్నాయి. తెలుగుదేశం పార్టీకి దక్కిన కమిటీల్లో ఒకరు జనసేన, ఒకరు బీజేపీ సభ్యులు ఉంటారు. ప్రతి కమిటీలోనూ నలుగురు మహిళలు ఉంటారు. ఈ సారి ట్రస్ట్ బోర్డుల్లో 50 శాతం మహి ళలకు కేటాయించనున్నారు. 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించనున్నారు.ఈసారి కొత్తగా నాయీ బ్రాహ్మణులు ఒకరు, బ్రాహ్మణ వర్గానికి చెందిన వారు ఒకరికి స్థానం కలిగించేలా ప్రభుత్వం చట్టం చేసింది.ప్రతి కమిటీలోనూ ఆయా దేవాలయాల పూజారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. దేవాలయ ట్రస్ట్ బోర్డు కమిటీల్లో మందు తాగే అలవాటు ఉన్నవారికి అవకాశం లేదు. హిందువై ఉండాలి. కనీసం 25 ఏళ్ల వయసు నిండి ఉండాలి.క్రిమినల్ కేసులు ఉండకూడదు. ఆలయ భూమి లీజుదారులై ఉండకూడదు. ట్రస్టు బోర్డు సభ్యులెవరికీ గౌరవ వేతనం ఉండదు. ఆలయ అభివృద్ధి,దేవునికి సేవ చేయడమే ప్రధాన లక్ష్యం.

### ఉమ్మడి జిల్లాలో 1713 ఆలయాలు..

ఉమ్మడి జిల్లాలో గుర్తింపు పొందిన ఆలయాలు 1713కు పైగా ఉన్నాయి. అందులో ఐదు లక్షల కంటే ఎక్కువ వార్షికాదాయం ఉన్న దేవా లయాలు 590 ఉన్నాయి.రూ.50 వేల నుంచి రూ.కోట్లలో ఆదాయం ఉన్నవి 370 ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాలో రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య ఆదాయం కలవి 127 ఉన్నాయి. తక్కువ ఆదాయం కలవి 68 ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రూ.5 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవి 226, రూ.కోట్లలో ఆదాయం ఉన్నవి 19 ఉన్నాయి. మొత్తం అన్నిరకాలు కలిసి 611 ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 5 లక్షల కంటే ఎక్కువ ఆదాయం కలవి 200, పెద్దవి 11 ఉన్నాయి. అన్ని రకాలు కలిపి 900 ఉన్నాయి.

- నామినేటెడ్ పదవులకు తీవ్ర పోటీ
- ట్రస్ట్ బోర్డు కమిటీలపైనా దృష్టి
- ఉమ్మడి జిల్లాలో 1713 ఆలయాలు
- వేలాది మందికి అవకాశం
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఛాన్స్
- మహిళలకు 50శాతం
- రాజమండ్రిలో మూడు కమిటీలు

## నేడు, రేపు సీపీఐ జిల్లా మహాసభలు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ తూర్పుగోదావరి జిల్లా 26వ మహాసభలు ఈ నెల 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలిరోజు బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు చర్చిగేటు నుంచి ప్రజాప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. ఆనం కళాకేంద్రం వద్దనున్న సుబ్రహ్మణ్యమైదానంలో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. బహిరంగసభకు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర నేతలు జేవీ సత్యనారాయణమూర్తి, అక్కినేని వనజ, రావులపల్లి రవీంద్రనాథ్ హాజరవుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా జిల్లాలో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు.



## నిలకడగా గోదావరి

ధవళేశ్వరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం ధవళేశ్వరం వద్ద నిలకడగా కొనసాగుతుంది. మంగళవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ద్వారా 1,78,215 క్యూసెక్కులను దిగువకు విడిచిపెడుతున్నారు.ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 5 వేల క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 2700 క్యూసెక్కులు,పశ్చిమడెల్టాకు 7 వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.



## ఫసల్ బీమాతో...


# రైతులకు ధీమా

**రూ.76 ప్రీమియం చెల్లిస్తే రూ.38వేలు బీమా... ఈ నెల 15 వరకు గడువు**

అమలాపురం రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) రైతు నష్ట నివారణకు దోహద పడుతుంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి అందేవరకు అన్నదాతలకు ఆందోళన తప్పట్లేదు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకం అమలు చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలతో పంటకు నష్టం వాటిల్లితే రైతులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా బీమా వర్తించేలా ఈ పథకాన్ని రూపొందించినట్టు వ్యవసాయ శాఖ అమలాపురం డివిజన్ సహాయ సంచాలకుడు కెనడీ, మండల వ్యవసాయాధికారి క్రెప్రవీణ్ తెలిపారు. వరి పంటకు సంబంధించి బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**రూ.76 ప్రీమియం చెల్లిస్తే చాలు..**

- ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు పీఎంఎఫ్‌బీవై పథకం కింద రూ.76 ప్రీమియంగా చెల్లిస్తే రూ.38వేలు బీమా వర్తిస్తుంది.
- పంట ముంపు బారిన, చీడపీడల బారిన పడ్డా, తుఫాన్లు వంటి ప్రకృతి విపత్తులతో పంట నష్టపోయినా ఫసల్ బీమా వర్తిస్తుంది.
- పంటకోసి పనలపై ఉన్నప్పుడు అకాల వర్షాలు, వరదలు, తుఫాన్లు కారణంగా పంట దెబ్బతిన్నా బీమా వర్తింపజేస్తారు.
- పంట ముంపు బారిన పడితే 48 గంటల్లోగా సంబంధిత బ్యాంకులతో పాటు వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలి.
- గ్రామం యూనిట్‌గా నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లిస్తారు.
- బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకులే ప్రీమియం చెల్లించి బీమాను వర్తింపచేస్తాయి.
- రుణం తీసుకోని రైతులు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్, పోస్టాఫీసు ద్వారా ప్రీమియం చెల్లించి రసీదు పొందవచ్చు.
- ఇందుకోసం హెల్ప్ లైన్ నెంబరును ప్రకటించారు. టోల్‌ఫ్రీ నెంబరు 1800-209-3536, ఎన్‌సీఐపీ హెల్ప్‌లైన్ నెంబరు 14447కు సమాచారం అందించి వివరాలు తెలుసుకోవచ్చు.


Department of Posts
Ministry of Communications
Government of India

Advanced Postal Technology 2.0
Internal Mobile APP

Developed & Powered By
CENTRE FOR EXCELLENCE IN POSTAL TECHNOLOGY

నవీకరణలో తపాల శాఖ మరో మైలురాయి చేరుకుంది. కంప్యూటర్ అనుసంధానం, డిజిటలైజేషన్, ఇండియన్ పోస్ట్ పేమెంట్‌తో ముందుకు సాగుతుండగా తాజాగా మరో అడుగు ముందుకు వేసింది. సొంతంగా ఎ.పి.టి 2.0 (అడ్వాన్స్‌డ్ పోస్టల్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ)ని రూపొందించుకుంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించగా సత్ఫలితాలు రావడంతో దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా అన్ని పోస్టాఫీసుల్లోనూ ఆధునీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.




## పోస్టల్ సేవలు...

# ఇంటి నుంచే!

(అమలాపురం టౌన్/మండపేట-ఆంధ్రజ్యోతి)

భారతీయ తపాలా శాఖ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సేవలను మరింత విస్తృతం చేసింది. ఇంటి వద్ద నుంచే పోస్టల్ సేవలు పొందే అవకాశం కల్పించింది. ఇప్పటికే గ్రామీణ స్థాయిలో బ్యాంకింగ్ రంగంలో దూసుకుపోతోంది. ఇకపై ప్రఖ్యాత డోర్ డెలివరీ సంస్థలు అయిన ప్రైవేటు ఈ-కామర్స్‌తో పోటీపడుతూ తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో డోర్ డెలివరీకి శ్రీకారం చుట్టింది.

తపాలా శాఖ న్యూ జనరేషన్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ పోస్టల్ సేవలను ఖాతాదారులకు అందుబాటులోకి తెచ్చింది. అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ-2.0) సేవలను జిల్లాలోని అన్ని తపాలా కార్యాలయాలకు అనుసంధానం చేశారు. ప్రస్తుతం తపాలా సేవలన్నీ నూరు శాతం వెబ్ ఆధారిత క్లౌడ్ టెక్నాలజీతో అనుసంధానం చేశారు. ఏపీటీ 2.0 విధానంలో అత్యాధునికంగా జరుగుతున్న సైబర్ నేరాలను నియంత్రించడంతో పాటు వాటిపై ఎప్పుడూ నిఘా కొనసాగుతూనే ఉంటుంది.


**ఐఎంపీ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుంటే చాలు..**

వినియోగదారులు, ఖాతాదారులు ఏపీటీ సేవలు పొందేందుకు మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఐఎంపీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. వెంటనే ఐడీ నెంబరు వస్తుంది. ఆ నెంబరు ద్వారా రిజిస్టర్ పోస్టు, స్పీడ్ పోస్టు తదితర తపాలా సేవలను ఇంటి నుంచే పొందవచ్చు. పోస్టు చేయదలచిన పార్సిల్ అంచనా బరువు, సమీప పోస్టాఫీసు వివరాలను ఐఎంపీ యాప్‌లో నమోదు చేస్తే సంబంధిత ప్రాంత పోస్టుమన్ ఇంటి వద్దకే వచ్చి పార్సిల్ తీసుకెళ్తాడు. బరువు ఆధారంగా చార్జీలు ఉంటాయి. సంబంధిత చార్జీలను వినియోగదారులు నగదు, యూపీఐ ద్వారా చెల్లించవచ్చు. ఐఎంపీ యాప్ ద్వారా ఏ సమయంలోనైనా పార్సిల్‌ను బుక్ చేసుకోవచ్చు. పికప్ మాత్రం పోస్టాఫీసు పనివేళల్లోనే ఉంటుంది. ఐఎంపీ యాప్ నుంచే ఖాతాదారులు తపాలా సుకన్య సమృద్ధి యోజన, కిసాన్ వికాస్ పత్రాలు తదితర పొదుపు పథకాల్లో డిపాజిట్ చేసేందుకు కూడా వెలుసుబాటు కల్పించారు.

### ఐఎంపీ యాప్‌తో మరింత విస్తృతం




### ప్రజలకు చేరువగా తపాలా సేవలు



ఆర్.నవీన్‌కుమార్, పోస్టల్ సూపరింటెండెంట్, అమలాపురం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

డివిజన్‌లోని అన్ని తపాలా కార్యాలయాలను అత్యాధునిక టెక్నాలజీతో అనుసంధానం చేశాం. ఇప్పటికే సేవలు ప్రారంభమయ్యాయి. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా మరిన్ని సేవలను అందించనున్నాం. ప్రైవేటు ఈ-కామర్స్ సంస్థలకు పోటీగా సరికొత్త టెక్నాలజీతో ఐడీసీ సెంటర్లు ఏర్పాటు చేయనున్నాం. ఇప్పటికే కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ (ఐడీసీ) సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇకపై తపాలా శాఖ సొంత వాహనాల ద్వారానే పార్సిల్స్ సరఫరా చేసే విధంగా కేంద్ర తపాలా శాఖ చర్యలు చేపట్టింది. విదేశాలకు పంపించే పార్సిల్స్ సంఖ్య గతంలోకంటే పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన తల్లికి వందనం, పీఎం కిసాన్ యోజన తదితర పథకాల నిధులను లబ్ధిదారులు గ్రామీణ ప్రాంతాల్లోని బ్రాంచి పోస్టాఫీసుల్లోనే పొందుతున్నారు.

## అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

**ఎస్పీ బిందుమాధవ్.. హోంగార్డు నుంచి కానిస్టేబుల్స్‌గా ఎంపికైన 15 మందికి సత్కారం**



కానిస్టేబుల్స్‌గా ఎంపికైన హోంగార్డులతో ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో చేరాలన్న జీవితాశయాన్ని సాధించేందుకు హోంగార్డుగా పనిచేస్తూ ఓ పక్క విధులు నిర్వర్తిస్తూ మరో పక్క కష్టపడి, పట్టుదలతో నెరవేర్చుకోవడం అభినందనీయమని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. సుదీర్ఘ కాలంగా హోంగార్డులుగా పని చేస్తూ పోలీస్ సెలక్షన్స్‌లో కానిస్టేబుల్స్‌గా ఎంపికైన 15 మందిని మంగళవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి, అంకితభావంతో పనిచేస్తే ఫలితాలు సానుకూలంగా వస్తాయన్నారు. శిక్షణలో వృత్తి నైపుణ్యాలను మరింత పెంచుకోవాలన్నారు. భవిష్యత్తులో మంచిస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కాగా తమకు చదువుకునేందుకు తగిన సమయం ఇవ్వడమే కాకుండా, శ్యామ్ ఇనిస్టిట్యూట్ నుంచి స్టడీ మెటీరియల్స్ తీసుకువచ్చి అందించి కానిస్టేబుల్స్‌గా ఎంపికవ్వడంలో ఎస్పీ కీలక పాత్రపోషించారన్నారు. ఆయన సేవలను జీవితంలో మరవలేమన్నారు. అనంతరం 15 మందిని ఎస్పీ అభినందించి, సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఏఆర్ ఎస్.శ్రీనివాసరావు, డీఎస్పీ ఏఆర్ శ్రీహరి రావు, హోంగార్డు ఆర్ఐ ఎం.నరసింహమూర్తి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్నకు ప్రత్యేక పూజలు

**స్వామివారి ఆలయంలో రెండో రోజు వైభవంగా సాగిన పవిత్రోత్సవాలు**



స్నపనమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవా భాగంగా మంగళవారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. వసంత మండపంలో ఉత్సవ మూర్తులు కొలువుదీరారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రోక్షణ, పవిత్ర ప్రతిష్ఠ, ప్రధాన హోమాలు, అష్టకలశారాధన, మహాస్నపనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేదమంత్రాల సాక్షిగా వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ప్రధాన హోమాలు, పవిత్ర ఆరోహణ కార్యక్రమాలను శాస్త్రోక్తం గా నిర్వహించారు. ఉపకమిషనరు ఈవో నల్లం సూర్యచక్రధరరావు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆలయంలోని వసంత మండపంలో పవిత్రోత్సవ పూజలు నిర్వహిస్తున్న పండితులు

## జనవాణి వినతుల స్వీకరణ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో మంగళవారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో జనవాణి నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం, జీతాల పెంపుదల, ఉద్యోగ భద్రతపై ప్రజలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇచ్చిన వినతులను కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ స్వీకరించారు. మహిళలు, వివిధ వర్గాల ప్రజలు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారుల తో ఎమ్మెల్యే నానాజీ మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.



కాంట్రాక్టు ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

## ఈ నెల 23 నుంచి ఉద్యోగులకు సీపీటీ పరీక్ష

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 340 మందికి నిర్వహణ**

**కాకినాడ జేఎన్టీయూలో ఏర్పాట్లు**

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, అటెండర్లకు ఈ నెల 23, 24, 30 తేదీల్లో సీపీటీ (కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్) పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నోడల్ అధికారి షాన్‌మోహన్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. కాకినాడ, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న 340 మంది ఉద్యోగులకు కాకినాడ జేఎన్టీయూలో పరీక్ష జరగనుంది. ప్రభుత్వ ఉద్యోగులు కంప్యూటర్ పరిజ్ఞానం ఏ మేరకు ఆర్జించారో తెలుసుకునేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు.

## క్రీడలతో శారీరక ఆరోగ్యం

- టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్
- కాకినాడ కింగ్స్ క్రికెట్ జట్టు పరిచయ కార్యక్రమం
- వేడుకగా లోగో, జెర్సీ ఆవిష్కరణ




కాకినాడ కింగ్స్ లోగో ఆవిష్కరిస్తున్న జ్యోతుల నవీన్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. కాకినాడ గోదావరి కళాక్షేత్రంలో మంగళవారం ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)కు కాకినాడ కింగ్స్ క్రికెట్ జట్టు పరిచయ కార్యక్రమంతో పాటు లోగో, జెర్సీ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నవీన్ మాట్లాడుతూ గతంలో క్రీడాకారుల వయసు మీరినా అవకాశం వచ్చేది కాదని, ప్రస్తుతం ఉన్న వాళ్లకి ఏపీఎల్, ఐపీఎల్ అనే టోర్నమెంట్లు ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా ఒత్తిడి లేని విద్యను అభ్యసించి క్రీడల్లో రాణించాలన్నారు. కాకినాడ కింగ్స్ పేరుతో ఒక క్రికెట్ జట్టు ఏర్పాటు కావడం ఆనందదాయకమన్నారు. ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులకు సౌకర్యాలు కల్పిస్తామని రోటరీ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాకినాడ కింగ్స్ ఫ్రాంచైజీ యజమానులు పుట్టా శరత్, అవినాష్, ఈవెంట్ ఆర్గనైజర్ కామిరెడ్డి రాజేష్, ఎల్.టిక్కు, బన్నీ, తోట సుబ్బారావు నాయుడు, కాకినాడ కింగ్స్ క్రికెట్ కెప్టెన్ భరత్ పాల్గొన్నారు.

**ముగిసిన 'కింగ్స్' ప్రాక్టీస్**

కాకినాడ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలోని రంగరాయ వైద్యకళాశాల క్రీడా మైదానంలో ఐదు రోజులుగా చేస్తున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) కాకినాడ కింగ్స్ జట్టు ప్రాక్టీస్ మంగళవారం ముగిసిందని అసోసియేషన్ సెక్రటరీ వెంకటేష్ తెలిపారు. ప్రముఖ క్రికెటర్ కేఎస్ భరత్ సారథ్యంలో ఈ నెల 8 నుంచి విశాఖపట్నంలో జరగనున్న ఏపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు కాకినాడ కింగ్స్ జట్టు సన్నద్ధమైంది. ఏపీఎల్‌లో ఇప్పటి వరకు ఆరు టీమ్‌లు ఉండగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కృషితో కాకినాడ కింగ్స్ జట్టుకు ఏడో జట్టుగా ఎంట్రీ లభించింది.



బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న కాకినాడ కింగ్స్ కెప్టెన్ భరత్

## కేళ.. భళా

- మార్కెట్‌కు 30 వేలు అరటి గెలలు
- 'కర్పూరం'కు పెరిగిన డిమాండ్
- ధర.. రూ.200 నుంచి రూ.500

రావులపాలెం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అంతరరాష్ట్ర అరటి మార్కెట్ యార్డుగా ఖ్యాతి గాంచిన రావులపాలెం అరటి మార్కెట్‌యార్డుకు మంగళవారం రికార్డుస్థాయిలో 30 వేలు అరటిగెలలు వచ్చాయి. ప్రతిరోజు స్థానిక అరటి మార్కెట్‌యార్డుకు రైతులు 10వేల నుంచి 12 వేల గెలలు తీసుకొస్తుంటారు. కాగా 30వేల అరటిగెలలు రైతులు తీసుకురావడంతో వ్యాపారులు, రైతులు అరటిలోడు, మోటార్‌సైకిళ్లతో మార్కెట్‌యార్డు ప్రాంతంతో పాటు సర్వీస్ రోడ్డు బయట పెద్దఎత్తున అరటి గెలలు దర్శనమిచ్చాయి. ఈ నెల 8న వరలక్ష్మివ్రతం సందర్భంగా వ్యాపారులు కూడా ఇతర ప్రాంతాల నుంచి అరటి గెలలు కొనుగోలు చేసేందుకు మార్కెట్ యార్డుకు వస్తున్నారన్న సమాచారంతో రైతులు పెద్దఎత్తున అరటిగెలలను తీసుకువచ్చారు. నిన్నటి వరకూ కర్పూరరకం అరటిగెల రూ.150 నుంచి 300 వరకూ మాత్రమే పలికింది. శ్రావణ మాస పర్వదినాలలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన వరలక్ష్మి వ్రతం సందర్భంగా కర్పూర రకానికి భారీగా డిమాండ్ పెరిగి రూ.200 నుంచి రూ.500 వరకూ గెల ధర పలకడంతో రైతులు ఆనందపడ్డారు. మార్కెట్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సెక్రటరీ ఐఎస్ రాజువర్మ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మార్కెట్‌కు గెలలు తీసుకొచ్చిన రైతులు

## బెస్ట్ సహకార సంఘంగా దొమ్మేరు

కొవ్వూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బెస్ట్ సహకార సంఘంగా దొమ్మేరు సొసైటీని ఎంపికచేసి అవార్డు అందజేశారు. ఈ నెల 4న విజయవాడలో ఆప్కాబ్ 62వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఉత్తమ పనితీరు కనబర్చిన సొసైటీలకు అవార్డులను అందజేశారు. దానిలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో అందించిన సేవలకు గాను దొమ్మేరు వ్యవసాయ సహకార సంఘానికి బెస్ట్ పీఏసీఎస్‌గా అవార్డును అందజేశారు. ఈ అవార్డును రాష్ట్ర సహకారశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు చేతుల మీదుగా దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, కార్యదర్శి కరిబండి ప్రసాద్ అందుకున్నారు. రూ.20 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను అందజేశారు.



## పోషణ పిచికారీతో బహుళ ప్రయోజనాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త భువనేశ్వరి

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మల్బరీ తోటలకు పోషక విలువలు అవసరమని, ఇందుకు మొక్కలు కత్తిరించిన 25-30 రోజుల వ్యవధిలో ఒక లీటరు పోషణను 140 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని సెంట్రల్ సిల్క్ బోర్డు పరిశోధనా విస్తరణ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భువనేశ్వరి పేర్కొన్నారు. దీని వల్ల భూమిలో లభించని పోషకాలను పోషణ ద్వారా మల్బరీ మొక్కలు గ్రహిస్తాయని, తద్వారా పట్టు పురుగుల పెంపకం లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మేరా రేషమ్-మేరా అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టు రైతులకు పోషణ పిచికారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జి అసిస్టెంట్ సెరీకల్చర్ అధికారి కె.సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు, పట్టు రైతులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు

- వాకపల్లికి, గజ్జెనపూడికి సరఫరా అయిన కుళ్లిపోయిన కోడిగుడ్లు
- ఇలాంటి తింటే రోగాల బారిన పడక తప్పదని లబ్ధిదారుల ఆవేదన





ప్రత్తిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడు అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు సరఫరా చేస్తున్నారు. దీంతో బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం ఎంతో సదుద్దేశ్యంతో అమలు చేస్తున్న పౌష్టికాహార పథకాన్ని అక్రమార్కులు నీరుగారుస్తున్నారు. మండలంలోని వాకపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రానికి కాంట్రాక్టర్ సరఫరా చేసిన గుడ్లు కుళ్లిపోవడమే కాకుండా కలిగిపోయి పాడైపోయినవి లబ్ధిదారులకు అందజేశారు. దీంతో వీటిని వినియోగించలేని పరిస్థితి ఎదురైంది. ఈ గుడ్లను పౌష్టికాహారంగా తీసుకుంటే రోగాల బారిన పడక తప్పదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి గజ్జెనపూడిలోని తదితర అంగన్‌వాడీ కేంద్రాలకు కాంట్రాక్టర్ నాసిరకం గుడ్లు సరఫరా చేస్తున్నట్టు తెలుస్తుంది. ఐసీడీఎస్ అధికారులు తక్షణం నాణ్యమైన గుడ్లు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


సరస్వతీదేవి అలంకరణలో వనదుర్గ

# సరస్వతీదేవిగా వనదుర్గ

● రత్నగిరి క్షేత్రరక్షకి ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు
● సారె సమర్పించిన అన్నవరం దేవస్థానం వేదపండితులు


వనదుర్గమ్మకు సారె సమర్పిస్తున్న దేవస్థానం వేదపండితుల కుటుంబసభ్యులు

అన్నవరం, ఆగస్టు 5 (అన్నవరం): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గమ్మ ఆలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం అమ్మవారు సరస్వతీ అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తకోటికి జ్ఞానాన్ని ప్రసాదించే సరస్వతిగా అనుగ్రహించారు. ఆలయంలో విశేషపూజలు, కుంకుమార్చనలు జరిగాయి. తొలిరోజు దేవస్థానం తరుపున ఈవో కుటుంబసభ్యులు సారె సమర్పించగా రెండోరోజు దేవస్థానం వేదపండితులు కుటుంబసభ్యులతో సారెను అందించగా అర్చకులు స్వీకరించి అమ్మవారి పాదాలచెంత ఉంచారు.

# కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

## జెండా ఊపి ప్రారంభించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానం వేదికగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని కలెక్టర్ షాన్‌మోహన్ ఆర్మీ అధికారులతో కలిసి మంగళవారం తెల్లవారుజామున జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 20 వరకు జరిగే ర్యాలీ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల నుంచి సుమారు 10వేల మంది అభ్యర్థులు ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. శారీరక పరీక్షల్లో అర్హత సాధించిన వారికి బుధవారం మెడికల్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్మీ అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.


ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్


ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొన్న అభ్యర్థులు

## గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ క్లీనర్ మృతి


మరణించిన సయ్యద్ సాదిక్

కొవ్వూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని కర్ణాటకకు చెందిన లారీ క్లీనర్ మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. వివరాల ప్రకారం.. కర్ణాటకలోని కొలార్ పట్టణంలోని రామత్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ సయ్యద్ రోషన్‌పాష, క్లీనర్ సయ్యద్ సాదిక్ జూలై 31న కెమికల్ లోడ్ వేసుకుని బెంగుళూరు నుంచి వైజాగ్ బయలుదేరారు. సోమవారం రాత్రి 7-15 గంటల సమయంలో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం గోవర్ధనగిరిమెట్ట వద్ద లారీని రోడ్డు పక్కన పార్క్ చేసి భోజనానికి దిగారు. క్లీనర్ సయ్యద్ సాదిక్(42) రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో సాదిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ సయ్యద్ రోషన్‌పాష అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు రూరల్ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు పేర్కొన్నారు..

## హిజ్రాలపై బైండోవర్ కేసులు

తాళ్లరేవు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం నుంచి లచ్చిపాలెం వరకు 216 జాతీయ రహదారి పక్కన హిజ్రాల స్థావరాలపై కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ బృందం మంగళవారం దాడులు చేసింది. ఐదుగురు హిజ్రాలను పట్టుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని తాళ్లరేవు తహశీల్దారు కార్యాలయానికి పంపించారు. వారిపై తహశీల్దారు పి.త్రినాథరావు బైండోవర్ కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ ఇచ్చి పూచీకత్తులతో పంపించారు.

## తండ్రి మందలించాడని కుమార్తె అదృశ్యం

### కేసు నమోదు

అమలాపురం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎక్కువగా ఫోన్ మాట్లాడుతున్న కుమార్తెను తండ్రి మందలించడంతో అలిగి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో అమలాపురం తాలూకా పోలీసులు మంగళవారం విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నారాయణపేటకు చెందిన ఆకుల విజయభాస్కర్ కుమార్తె లోహిత తన పెద్దమ్మ అయిన కొండ్రెడ్డి రామలక్ష్మి ఇంటి వద్ద ఉండి డిగ్రీ ప్రైవేటుగా చదువుతోంది. రామలక్ష్మి కామనగరువు శివారు బాలయోగి కాలనీలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చిన తండ్రి విజయభాస్కర్ ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడుతున్న కుమార్తె లోహితను మందలించాడు. దాంతో లోహిత మధ్యాహ్న 3.30 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. అన్నిచోట్లా గాలించి ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో విజయ్‌భాస్కర్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ మురళీమోహనకృష్ణ పేర్కొన్నారు.



# విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం... కుటుంబానికి శాపం!

● మృతుడి పేరుతో 17 విద్యుత్ కనెక్షన్లు
● రేషన్‌కార్డు దరఖాస్తులో బట్టబయలు
● అందని ప్రభుత్వ పథకాలు


దివ్యాంగ బాలుడు లిశాంత్‌రాజు


వద్దిపర్రుకు చెందిన అజ్జయ్య ఆధార్ నెంబరుతో 17 విద్యుత్ సర్వీసులు మంజూరు చేసిన దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన ఓ వ్యక్తి పేరు మీద 17 విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్టుగా ఆన్‌లైన్‌లో చూపించడంతో ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆ కుటుంబ సభ్యులు అర్హత కోల్పోగా విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వద్దిపర్రుకు చెందిన పల్లెకొండ అజ్జయ్య అనే దళిత వృద్ధుడు ఇటీవల మరణించాడు. అతడి కుమారుడు భీమరాజు ఓ ప్రవేట్ స్కూల్‌లో పనిచేస్తున్నాడు. అర్జయ్య భార్యతో పాటు కుమారుడు భీమరాజు, భార్య ఒకే రేషన్‌కార్డులో ఉన్నారు. భీమరాజుకు రెండేళ్ల బాలుడు లిశాంత్‌రాజ్ ఉన్నాడు. పుట్టుకతోనే బాలుడికి మెదడు పనిచేయకపోవడంతో మంచానికి పరిమితమయ్యాడు. లిశాంత్‌కు నూరుశాతం పర్సంటేజీతో సదరం సర్టిఫికెట్ వైద్యులు మంజూరు చేశారు. కుమారుడి పేరు రేషన్‌కార్డులో నమోదు చేసేందుకు తండ్రి భీమరాజు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసేందుకు వెళ్లగా మీ తండ్రి అర్జయ్య పేరు మీద 17 విద్యుత్ సర్వీసులు ఆన్‌లైన్‌లో ఉన్నట్టు చెప్పడంతో నిర్ఘాంతపోయాడు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాడు.

### ఎక్కడ జరిగింది తప్పు...

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి ఓ దళిత కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందకుండా పోతున్నాయి. బాలుడికి దివ్యాంగ పింఛన్ వస్తే వైద్యానికి ఉపయోగపడుతుందని ఆ కుటుంబం భావిస్తుంది. 2018లో విద్యుత్ మీటర్లకు ఆధార్‌లింక్ అనుసంధానం చేశారు. విద్యుత్ మీటర్లు ఉన్న వ్యక్తుల ఆధార్ కార్డు ఇంటిపన్ను రశీదులు సేకరించారు. ఏపీ ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయానికి సిబ్బంది పంపించారు. నియోజకవర్గంలోని 4 మండలాల విద్యుత్ మీటర్లకు ఆధార్‌నెంబరుతో అనుసంధానం చేశారు. ఆధార్ లింక్ చేసే సమయంలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు బలంగా ఏర్పడ్డాయి. కొంతమంది సిబ్బంది బినామి పేర్లతో ఆధార్‌లింక్ చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందక లబోదిబోమంటున్నారు.

# శ్రీలంక సముద్ర జలాల్లో పట్టుబడిన కాకినాడ ఫైబర్ బోటు

## నలుగురు మత్స్యకారుల అరెస్ట్

కాకినాడ సిటీ/ కె.గంగవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన ఫైబర్ బోటును శ్రీలంక సముద్ర జలాల్లో సోమవారం రాత్రి గస్తీ సిబ్బంది పట్టుకున్నారు. స్థానిక జగన్నాథపురం పరదేశమ్మపేటకు చెందిన పంతాడి బ్రహ్మానందం కేరళలో రూ.40 లక్షలు పెట్టి ఫైబర్ బోటు కొనుగోలు చేసి కాకినాడ తీసుకు వస్తుండగా ఈ ఘటన జరిగింది. రామేశ్వరం బ్రిడ్జి దిగువ నుంచి రావాల్సిన బోటు జీపీఎస్ సాంకేతిక లోపం వల్ల చుట్టుతిరిగి ప్రయాణిస్తూ శ్రీలంక సముద్ర జలాల్లోకి వెళ్లిపోయారు. దీంతో ఆ దేశ గస్తీ సిబ్బంది ఫైబర్ బోటు, అందులోని నలుగురు మత్స్యకారులను అదుపులోకి తీసుకుని ఇక్కడి మత్స్యశాఖ అధికారులకు సమాచారం తెలిపారు. అదుపులోకి తీసుకున్న మత్స్యకారుల్లో పంతాడి బ్రహ్మానందం, చింతా నాగేశ్వరరావు, కర్రి నూకరాజు, కొప్పాడి శ్రీను ఉన్నారు. వారిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు జిల్లా అధికారులతో మాట్లాడారు. శ్రీలంకలో అరెస్టుయిన మత్స్యకారుల్లో ఒకరైన కర్రి నాగరాజు అత్తగారి గ్రామం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలోని మసకపల్లి. నాగరాజు అరెస్టుతో గ్రామంలోని వారి కుటుంబం ఆందోళనకు గురైంది. ఆందోళన చెందవద్దని సర్పంచ్ పల్లి అన్నపూర్ణ కళ్యాణ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. అరెస్టయిన నలుగురిని తిరిగి భారత్‌కు తీసుకువస్తామని మత్స్యకార సంఘం నాయకుడు కర్రి చిట్టిబాబు తెలిపారు. మంగళవారం ఆయన కోటిపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. దీనిపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ద్వారా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి శ్రీలంక అధికారులతో సంప్రదింపులు జరిపామని, త్వరలోనే వారిని దేశానికి తీసుకువస్తామని ఆయన చెప్పారు. ఆయా కుటుంబాలు వారు ఆందోళన చెందవద్దని కోరారు.


మసకపల్లిలో కర్రి నూకరాజు కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న సర్పంచ్

# ఉత్కంఠభరితంగా...

## కాకినాడలో ఐదో రోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు


కాకినాడలో హాకీ ఆడుతున్న ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా టీంలు


కర్ణాటక, జార్ఖండ్ టీంలు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్‌షిప్-2025లో భాగంగా మంగళవారం ఐదోరోజు కాకినాడ క్రీడా మైదానం ఆస్ట్రోటర్ఫ్ ఫీల్డ్‌లోని 6 మ్యాచ్‌లు జరిగాయి. తమిళనాడు వర్సెస్ ఢిల్లీ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగి డ్రాగా ముగిసింది. మిగిలిన మ్యాచ్‌లు ఏకపక్షంగానే సాగాయి. మ్యాచ్‌లను రాష్ట్ర హాకీ సంఘ కార్యదర్శి హర్షవర్ధన్ ప్రారంభించారు. సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి, పి.తామస్ పీటర్, భవానిశంకర్ పర్యవేక్షించారు.

### మ్యాచ్‌ల వివరాలు...

పుదుచ్చేరి, ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ 11-0తో విజయం సాధించింది. తమిళనాడు, ఢిల్లీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3-3 స్కోర్ నమోదు కావడంతో డ్రాగా ముగిసింది. చండీఘడ్, మధ్యప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ 5-0తో విజయం సాధించింది. హర్యానా, బెంగాల్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా 7-1తో విజయం సాధించింది. కర్ణాటక, జార్ఖండ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్ 2-0తో విజయం సాధించింది. ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిస్సా 3-1 తేడాతో విజయం సాధించింది.

# 14న డిప్యూటీ సీఎం పవన్ రాక

● పిఠాపురంలో పారిశ్రామిక పార్కుకు శంకుస్థాపన
● హెలిప్యాడ్ పరిశీలించిన అధికారులు


గొల్లప్రోలులో హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, అధికారులు

గొల్లప్రోలు/పిఠాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగే స్వాతంత్ర దినోత్సవంలో పాల్గొనేందుకు ఈనెల 14వ తేదీన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లాకు రానున్నారు. గొల్లప్రోలులో హెలిప్యాడ్‌కు చేరుకుని అదే రోజు సాయంత్రం పిఠాపురంలోని అగ్రహారం వద్ద ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక పార్కుకు శంకుస్థాపన చేస్తారు. అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం కాకినాడ బయలుదేరి వెళ్తారు. రాత్రికి కాకినాడలో బస చేసి 15న జరిగే స్వాతంత్ర దినోత్సవంలో పాల్గొంటారు. పవన్ హెలికాప్టర్‌లో రానున్న నేపథ్యంలో గొల్లప్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని హెలిప్యాడ్‌ను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ఇతర పోలీసు అధికారులు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. హెలిప్యాడ్ పరిసరాలు, అక్కడ చేయాల్సిన బందోబస్తు ఏర్పాట్లు తదితర అంశాలను వారు పరిశీలించారు. ఆయన వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తదితరులు ఉన్నారు. కాగా పిఠాపురంలో అగ్రహారం వద్ద ఏర్పాట్లను జిల్లా అడిషనల్ ఎస్పీ భాస్కరరావు పరిశీలించారు. అక్కడ చేయాల్సిన బందోబస్తు, రక్షణ ఏర్పాట్లుపై సూచనలు ఇచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

శంఖవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడి శివారు కాకినాడ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. రౌతులపూడి మండలం గిడజాం గ్రామానికి చెందిన ప్రవీణ్, విజయ్ కాకినాడ వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా పెట్రోలు బంక్ సమీపంలో లారీని తప్పించబోయి అదుపుతప్పి పడిపోయారు. ప్రవీణ్‌కు కాలు విరిగిపోగా, విజయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108లో పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పీడీఎస్ బియ్యం స్వాధీనం

జగ్గంపేట రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపూడి వద్ద అశోక్ లేలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్‌వోకు అందిన సమాచారం మేరకు ప్రత్తిపాడు డీటీసీఎస్ ఏలేశ్వరం నుంచి గోకవరం వెళ్తుండగా మార్గంమధ్యలో రాజపూడి వద్ద వాహనం ఆపి తనిఖీ చేసి సుమారు 3610 కిలోల అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1,67,026 ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వారు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

# లాడ్జిలో ఉరేసుకున్న వివాహిత

కొవ్వూరు/కొత్తపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): లాడ్జి రూములో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ సమీపంలోని కుతుకుడుమిల్లి గ్రామానికి చెందిన కాసా శివాని (30) సోమవారం రాత్రి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో ఉన్న సాయిలక్ష్మి లాడ్జిలో దిగింది. మంగళవారం రాత్రి అయినా తలుపులు తెరవకపోవడంతో లాడ్జి సిబ్బంది అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టణ సీఐ విశ్వం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తెరవడంతో రూములో సీలింగ్ ఫ్యాన్‌కు మహిళ చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. లాడ్జిలో అందించిన ఫోన్ నంబరు ఆధారంగా మహిళ బంధువుల ఆచూకీ తెలుసుకుని మృతి విషయాన్ని తెలియజేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా శివాని కుటుంబ కలహాలతోనే విరక్తి చెంది ఉరి వేసుకుని ఉంటుందని సమాచారం.

# గంజాయితో నలుగురి అరెస్ట్


గంజాయితో పట్టుబడిన నిందితులతో చింతూరు పోలీసులు

చింతూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు మంగళవారం నలుగురిని అరెస్ట్ చేసి 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రమేష్ కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన నవీన్ కుమార్, బాకి రాజు, సుంకే అశోక్, చింతూరుకు చెందిన షేక్ అబ్బాస్ అలియాస్ తుర్రం మహేష్ ముఠాగా ఏర్పడి ఒడిస్సాలో 12 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. తదుపరి వయా చింతూరు మీదుగా తెలంగాణకు తరలించే యత్నంలో వాహన తనఖీల్లో భాగంగా అల్లూరి చింతూరు బస్‌స్టాండ్ వద్ద పోలీసులకు పట్టుపడ్డారు. రూ.60 వేలు విలువైన గంజాయితో పాటు నిందితులు వినియోగించిన 2 ద్విచక్ర వాహనాలు, 4 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమేష్ తెలిపారు.

# యర్రవరంలో జాతీయ పొల్యూషన్ బోర్డు కమిటీ సభ్యుల తనిఖీలు

ఏలేశ్వరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో ఉన్న అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం జాతీయ పొల్యూషన్ బోర్డు కమిటీ సభ్యులు తనిఖీలు చేశారు. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, శుద్ధి చేయని వ్యర్థ జలాలతో పొల్యూట్‌గా మారి చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని పెద్దనాపల్లికి చెందిన చిన్ని ఫిర్యాదు మేరకు జాయింట్ కమిటీ తనిఖీలకు వచ్చింది. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థ నీటిని పరిశ్రమ పరిధిలో సేకరించారు.


అవంతి పరిశ్రమ వ్యర్థ నీటిని సేకరిస్తున్న కమిటీ సభ్యులు

## బొగ్గు లారీ బోల్తా

ప్రత్తిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మినర్వా కళాశాల సమీపంలో సుద్దగడ్డవాగు వంతెన వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం అదుపు తప్పి బొగ్గు లోడు లారీ బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.


ప్రత్తిపాడులో బోల్తా పడిన బొగ్గు లారీ

## ఆర్టీసీ స్థలాలు ప్రైవేట్‌కు ఇవ్వడం తగదు



నిరసన తెలుపుతున్న యునైటెడ్ వర్కర్స్ యూనియన్

**యునైటెడ్ వర్కర్స్ యూనియన్ గేట్ మీటింగ్‌లో నిరసన**

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 137ను తీసుకొచ్చి ఆర్టీసీ స్థలాలను అడ్డగోలుగా ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, తక్షణమే జీవోను ఉపసంహరించుకోవాలని యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎస్‌పీ రావు, డిపో సెక్రటరీ బీఆర్‌కే కుమారి అన్నారు. ఆర్టీసీ ఆస్తులకు పూర్తి హక్కుదారులు రాష్ట్ర ప్రజలు, ఆర్టీసీ కార్మికులే అని స్పష్టం చేశారు. ఈమేరకు మంగళవారం యునైటెడ్ వర్కర్స్ యూనియన్ రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో గేట్ వద్ద గేటు మీటింగ్ నిర్వహించి నిరసన ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మహిళలకు ఉచిత రవాణా పేరుతో ఆర్టీసీని ప్రజలకు చేరువ చేస్తున్న సమయంలో సంస్థ స్థలాలను ప్రైవేట్ వారికి కట్టబెట్టడం ఆర్టీసీని మరింత నష్టపరిచే చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎంఎన్‌వీఎస్ నారాయణ, కేవీవీఎస్ నారాయణ, రేష్మ, జోసఫ్ నాయకత్వం వహించగా కార్మికులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**కృతజ్ఞత పర్యటనలో ఎమ్మెల్సీ గోపీ**

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీ అన్నారు. కృతజ్ఞత పర్యటనలో భాగంగా మండలంలోని పలు పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గిరిజన సంక్షేమ పాఠశాల, డైట్ కళాశాలలను సందర్శించి తనను గెలిపించినందుకు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ యాప్‌లు, వివిధ బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయుల బోధనా సమయాన్ని హరించడం సమజసం కాదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడం, సమస్యలపై ప్రభుత్వానికి రాయబారాలు చేయడం, కార్యాచరణ కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ విధానాలతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు పెరిగిపోయాయని వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. తక్షణమే 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## సమస్యల సాధనకు 3 నెలలు కార్యక్రమాలు

**రండి! టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు**



కడియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు

కడియం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల సాధన కోసం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ వారం ఓ కార్యక్రమం చొప్పున మూడు నెలల పాటు పలు కార్యక్రమాలు చేపడుతుందని సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ విల్సన్‌పాల్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రండి! టీ తాగుతూ మాట్లాడుకుం దాం కార్యక్రమం జరిగింది. దీనికి ఎంపీడీవో కార్యాలయ ఏవో సుబ్బారావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన రూ.30 వేల కోట్ల బకాయిల, డీఏ, ఐఆర్, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు వంటి సమస్యలతో పాటు అన్ని శాఖల ఉద్యోగుల్లోను పలు సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని ప్రభుత్వానికి నివేదించి పరిష్కరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.వీడియో కార్యక్రమం ద్వారా ఉద్యోగుల సమస్యలు వివరించారు. కార్యక్రమంలో నాయకులు జె.రాజారావు, కె.శ్రీనివాసరెడ్డి, టి.మణిశ్రీ, ఎన్‌వీఎస్ రాజు, పి.మురళీకృష్ణ, డాక్టర్ టీవీ శ్రీధర్, డాక్టర్ ఎస్.మౌర్య, కేఎస్ మూర్తి పాల్గొన్నారు. రాష్ట్రాధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఈ-పంట నమోదు తప్పనిసరి: ఏవో

బిక్కవోలు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రైతులందరూ ఈ-పంట నమోదు చేయించుకోకుంటే ప్రభుత్వ పథకాలు కోల్పోతారని మండల వ్యవసాయాధికారి ఎస్.శామ్యూల్‌జాన్ సూచించారు. మంగళవారం ఆయన బిక్కవోలు, ఊలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత భూమి ఉన్న రైతులందరికీ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ములు జమయ్యాయని, ఇంకా అర్హత ఉండి డబ్బులు పడని రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ ఆధారాలు అందజేసి నమోదు చేసుకోవాలన్నారు. వరి రైతులు పంటల బీమా చేయించుకోవాలని, ఈ నెల 15వరకూ సమయం ఉందని ఎకరాకు రూ.577 చెల్లించి ఈ-సేవ కేంద్రాల్లో బీమా చేయించుకోవాలన్నారు. అనంతరం ఆయన పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో కె.శ్రీనివాసు, వీఏఏలు కె.ప్రభాకర్, రాకేష్, దీప్తి, సుమిత్ర, రైతులు పాల్గొన్నారు.

## ఇకపై ఉపాధి కూలీలకు ముఖ ఆధారిత హాజరు

**ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణ కార్యక్రమంలో ఏపీవో అగస్టిన్‌కుమార్**

బిక్కవోలు, ఆగస్టు 5(ఆంధ్ర జ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు ఇకపై ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి అని ఏపీవో అగస్టిన్‌కుమార్ తెలిపారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బిక్కవోలు, అనపర్తి, రంగంపేట మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లకు కూలీల ముఖ ఆధారిత హాజరు తీసుకునే విధానంపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. పనులు జరిగే చోట జియో ట్యాగింగ్, ఫెన్సింగ్‌పైనా శిక్షణ అందజేశారు. కూలీలు పనిచేసే చోటే ఉదయం, మధ్యాహ్నం ముఖ ఆధారిత హాజరు తీసుకోవడం వల్ల దొంగ మస్తర్లకు తావుండదని వివరించారు. రీసోర్సుపర్సన్‌గా కె.సందీప్‌రెడ్డి, ఏవీబీ చక్రవర్తి,టీఏ వెంకన్నబాబు పాల్గొన్నారు.

## నర్సరీ రంగానికి ప్రాధాన్యమివ్వాలి

**ఏడీసీ ఎండీని కలిసిన నర్సరీ సంఘం**

కడియం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నర్సరీ రంగానికి ప్రాధాన్యమివ్వాలని నర్సరీ సంఘం కోరింది. ఈ మేరకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారధి భాస్కర్‌ను మంగళవారం నర్సరీ సంఘం అధ్యక్షులు రత్నం అయ్యప్ప, ప్రతినిధులు అమరావతిలో కలిసి రిప్రజెంటేషన్ అందజేశారు. అమరావతిలో కడియం నర్సరీ అసోసియేషన్‌కు 100 ఎకరాల భూమి కేటాయింపు చేయాలని, దీంతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన నర్సరీల ద్వారా అమరావతి మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. అమరావతిలో ప్లాంట్ బయోటెక్ డైవర్సిటీ, హార్టికల్చర్ రీసెర్చి సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏడీసీ ఎండీ మాట్లాడుతూ అమరావతి రాజధాని అభివృద్ధికి సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని, ఇందులో నర్సరీ రంగం భాగస్వామ్యం కావాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. అమరావతిలో నర్సరీల ఏర్పాటుకు కావాల్సిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పూర్తి వివరాలు ఇవ్వాలని దీనిపై ముఖ్యమంత్రికి పూర్తి నివేదిక ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో నర్సరీ సంఘం సభ్యులు కొండేపూడి నాగు, ట్రెజరర్ రత్నం బాబ్జి, కొవ్విడి వాసు, రైతులు పరిమి వాసు, వడగల రాజా, రత్నం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## సమాజ సేవకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలి

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు**



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సమాజ సేవ చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక తిలక్‌రోడ్డులోని తన కార్యాలయం వద్ద భవాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పలువురు పేద విద్యార్థులకు, కొందరి వైద్యానికి ఆర్థిక సాయం, ఏడాదిన్నర వయసున్న బాలుడికి మూడునెలలకు సరిపడా మందులు, అలాగే ఆర్ఎస్ న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో ఇద్దరు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను ఎమ్మెల్యే వాసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో అనేక మంది సంపన్నులు ఉన్నారని వారంతా పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. ఆర్ఎస్ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ కావు, స్వాతిలను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వేచ్ఛ, టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్, దొండపాటి సత్యంబాబు, మజ్జి రాంబాబు, రెడ్డి మణి, వైశ్రీను, ఉప్పులూరి జానకిరామయ్య, కొయ్యల రమణ, కడలి రామకృష్ణ, మొకమాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలలో గెస్ట్ లెక్చర్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మంగళవారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. భాష, సాహిత్యాల బోధన, అభ్యాసంపై డిజిటల్ సాధనాలు, సాంకేతికత గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయని లా కాలేజ్ ఇంగ్లీష్ ప్రొఫెసర్ వైభవ్ సబ్నీస్ అన్నారు.

## రహదారుల అభివృద్ధి పనుల్లో జాప్యం

- కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డితో ఎమ్మెల్యే బత్తుల భేటీ



మంత్రి జనార్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి పనుల విషయంలో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విజ్ఞప్తి చేశారు. అమరావతి పర్యటనలో భాగంగా ఆయన రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక విషయాలపై చర్చించారు. రాజానగరంలో రోడ్డు కాంట్రాక్టర్ పలు రోడ్ల పనులను పూర్తి చేయకుండా కాలయాపన చేస్తూ కావాలనే ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రికి వివరించినట్టు చెప్పారు. ప్రభుత్వం ఇటీవల బిల్లులు చెల్లించినా సదరు కాంట్రాక్టర్ రోడ్డు పనులను పూర్తి చేయలేదన్నారు. కాపవరం-ముగ్గళ్ల, చిన్నకొండేపూడి- చీపురుపల్లి, రాజానగరం-గాదరాడ రహదారుల పనులను ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు చెడ్డపేరు తీసుకొచ్చేందుకు కావాలనే జాప్యం చేస్తున్నారని, సకాలంలో పనులను పూర్తిచేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరామన్నారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందించి, రోడ్డు పనులు త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. వీటితో పాటు రూ.1.66 కోట్లతో రాజానగరం-పెడపర్తి రహదారి(14/600 నుంచి 16/0)వరకు, రాజమహేంద్రవరం-కేశవరం రహదారి(బొమ్మూరు మార్గం, 9/800 నుంచి 11/0) వరకు త్వరగా మెరుగుపర్చాలని ప్రతిపాదించామన్నారు. ఈ మేరకు రోడ్డు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

**అధికారుల సమీక్షలో ఆర్డీవో కృష్ణనాయక్**



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

రాజానగరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అధికారులను ఆదేశించారు. సీసీఆర్‌సీ కార్డులు, రేషన్‌కార్డుల పంపిణీ, వాటర్ ట్యాక్స్ జీవో 23 అమలు, అన్నదాత సుఖీభ వ, ఆధార్ సీడింగ్‌లో తలెత్తుతున్న లోపాలు తదితర రెవెన్యూ అంశాల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూమిలేని నిరుపేదలు నివాస స్థలా ల కోసం సమర్పించిన అర్జీలను పరిశీలించి, అవసరమైన భూములను గుర్తించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో రెవెన్యూ శాఖ పాత్ర కీలకమని ఆర్డీవో అన్నారు. అలాగే స్వామిత్వ పథకం, రీ-సర్వే ప్రక్రియలపై సమాంతరంగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పథకాలను వేగంగా పారదర్శకతతో అమలు చేయాలన్నారు. ప్రజలతో నేరుగా సంబంధమున్న రెవెన్యూ శాఖ అధికారులు నిబద్ధత, స్పందనతత్వంతో విధులు నిర్వర్తించాలన్నారు. ప్రతిరోజు లాగిన్‌లో క్లియర్ చేయాల్సిన అంశాలను పరిశీలించి తదుపరి చర్యల కోసం పైఅధికారులకు, లేదా సంబంధిత అధికారులకు నివేదించాలన్నారు. ఈవిషయంలో వీఆర్వోలది వ్యక్తిగత బాధ్యతగా పేర్కొన్నారు. ఈసమీక్షా సమావేశంలో తహశీల్దార్ జీఏఎల్ సత్యవతి దేవి, డిప్యూటీ తహశీల్దార్లు, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### డీ-ఫారమ్ పట్టా భూమికి దారి

దివాన్‌చెరువు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం పాతతుంగపాడు గ్రామానికి చెందిన యడ్ల యేసయ్యకు చెందిన డిఫారం పట్టా భూమికి దారిని ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న వారిపై బాధితుడు పెట్టుకున్న దరఖాస్తుకు ఆర్డీవో కృష్ణనాయక్ స్పందించారు. మంగళవారం గ్రామంలో సర్వే నెంబరు 286-1 చిన్నకొండగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఎ2.44 సెంట్ల భూమి యేసయ్యకు ఉందని, ఈ భూమికి దారి ఇవ్వకుండా గంగుమళ్ల వీరబాబు, వెంకన్నబాబు ఫెన్సింగ్ వేసారని బాధితుడు ఆర్డీవోకు ఫిర్యాదు చేయడంతో ఆయన రాజానగరం తహశీల్దార్, వీఆర్‌వోలతో కలిసి గ్రామానికి వెళ్లి పరిశీలించి ఇండియన్ ఎసెస్‌మెంట్ యాక్ట్ 1882ను అనుసరించి సర్వే నెం 285/5గా ఉన్న జిరాయితీ భూమి నుంచి మూడు అడుగులు నడక దారిని యడ్ల యేసయ్యకు చూపించినట్టు ఆర్డీవో కృష్ణనాయక్ పేర్కొన్నారు.

### నీల్స్ హెన్రిక్ జయంతి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల గణితశాస్త్ర విభాగంలో కంప్యూటర్ సైన్స్ సహాయంతో ప్రపంచ గణిత మేధావి నీల్స్ హెన్రిక్ ఎబుల్స్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ స్కూల్స్ విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ టెక్నో స్పియర్‌లో ఏఐ సహాయంతో గణితంలో ఆన్‌లైన్ టాలెంట్ హంట్ నిర్వహించారు.

### నేడు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

రాజానగరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6న రాజానగరంలో క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈశిబిరంలో మహిళలు, పురుషులకు క్యాన్సర్ సంబంధిత వైద్య పరీక్షలను వైద్య నిపుణుల సమక్షంలో ఉచిత పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆత్మబంధువులం సేవా సంఘం, తాడేపల్లిగూడెం వారిచే రాజానగరంలోని అన్నదాన సత్రం కళ్యాణ మండపంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ హైదరాబాదు వారు టెస్టులు చేయడం జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### తల్లిపాలలో పోషకాలు మెండు

గోకవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తల్లిపాల నుంచే పిల్లలకు పోషకాలు మెండుగా లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంజనీ అన్నారు. మండలంలోని తంటికొండ గ్రామంలో మంగళవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలకు ఆమె విచ్చేసి మాట్లాడారు. తల్లిపాలు తాగించడం వల్లే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషక పదార్థాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాస్కరం, బొజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

### కిశోర్‌కుమార్ జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రముఖ హిందీ గాయకుడు, కిశోర్‌కుమార్ 96వ జయంతి సందర్భంగా,స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద జిత్ మోహన్‌మిత్ర కళావేదికలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమానికి నట గాయకుడు జిత్‌మోహన్‌మిత్ర అధ్యక్షత వహించారు. కిశోర్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## రాష్ట్ర అథ్లెటిక్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

గోకవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులు ఆరుగురు అథ్లెటిక్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు మంగళవారం ప్రిన్సిపాల్ పి.సత్యశేఖర్ తెలిపారు. ఇటీవల పెద్దాపురంలో జరిగిన సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో మొత్తం ఆరు విభాగాల్లో ఈ అర్హత సాధించడం జరిగిందన్నారు. అండర్-16 విభాగంలో పి.లోకేశ్ 60 మీటర్లు, 600 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, అండర్-14 విభాగంలో స్వర్ణరాజ్ ట్రియాతి లిన్‌లో ప్రథమ స్థానం, పైడిమళ్ల సు జిత్ మణిరత్న భూషణ్ వెయ్యి మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, షాట్ పుట్, 600 మీటర్ల పరుగులో బి.ధనుష్ ద్వితీయ స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. స్టేట్ మీట్‌లో పాల్గొనడానికి ఈ ఆరుగురు బాపట్ల వెళ్లనున్నట్టు పీఈటీ జి.సుధ చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ సత్యశేఖర్ అభినం దించారు.

### రంగంపేట నుంచి ఏడుగురు..

రంగంపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రంగంపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఈ నెల 9నుంచి 11వరకు బాపట్లలో జరిగే సౌత్‌జోన్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం వి.పార్థసారధి తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు ఎంపికైన కారి నాగభవ్య, దంగేటి కీర్తన, కరాటం జాహ్నవి, సాయి వీరలక్ష్మి, కోడూరి యవనలక్ష్మి, సంగిరెడ్డి లక్ష్మణసాయి, కేవీవీ సత్యనారాయణలతోపాటు వారికి శిక్షణ ఇచ్చిన పీడీ శైలను ఆయన అభినందించారు.కార్యక్రమంలో వీసీ జాకబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ధవళేశ్వరంలో కార్డెన్ సెర్చ్

**రికార్డులు లేని 35 ద్విచక్ర వాహనాలు సీజ్**



ధవళేశ్వరంలో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యకిషోర్

ధవళేశ్వరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐవోసీఎల్ కాలనీలో మంగళవారం ఉదయం సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ పర్యవేక్షణలో సీఐ టి.గణేష్, ఎస్ఐ హరిబాబు,ప్రత్యేక పోలీస్ బృందం కార్డెన్ సెర్చ్ నిర్వహించింది. ఈ తనిఖీల్లో ఎటువంటి రికార్డులు లేని 35 ద్విచక్రవాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో టూటౌన్, కడియం సీఐలు, సౌత్‌జోన్ సిబ్బంది పాల్గొన్నారు.

### గోకవరంలో 26 బైక్‌లు

గోకవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గోకవరంలోని డ్రైవర్స్ కాలనీలో పోలీసులు, ప్రత్యేక బృందం నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో రికార్డులు సక్రమంగా లేని 26 వాహనాలను సీజ్ చేయడంతో పాటు ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. స్థానికేతరులను గుర్తించి వారి గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో కోరుకొండ సీఐ సత్యకిషోర్, స్థానిక ఎస్ఐ పవన్‌కుమార్, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 50 మంది పోలీసులు పాల్గొన్నారు.

## మెరుగైన పారిశుధ్య నిర్వహణకు తనిఖీలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తున్నామని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. మంగళవారం నగరంలోని సచివాలయాల పరిధిలో ప్రజల నుంచి అధికంగా ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాలైన వెంకటేశ్వనగర్, ఆల్‌బ్యాంక్ కాలనీ, ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. చెత్తతరలించే వాహనాల డ్రైవర్లతోను, పారిశుధ్య కార్మికులతోను మాట్లాడి పలు సూచనలు చేశారు. సామూహిక గృహాల అసోసియేషన్లతో మాట్లాడి నగర పరి శుభ్రతకు సహకరించాలని కోరారు. తడిపోడి చెత్తను వేరు చేసి ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ వెంట పబ్లిక్ హెల్త్ సిబ్బంది సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తే సహించం

**ఎమెల్యే నల్లమిల్లి.. కుతుకులూరు పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ**



కుతుకులూరులో అంగన్‌వాడీ కార్యకర్తపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని, వాటి నిర్వహణలో అలసత్వం వహిస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువస్తే సహించబోమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కుతుకులూరులో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని 164, 165 అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే.. చిన్నారులకు అందించడానికి సిద్ధం చేసిన ఉడకని అన్నం, నీళ్ల వంటి సాంబారు, పాడైన కూరగాయలను గుర్తించారు. అంతే కాకుండా నెల ప్రారంభమై వారం కా వస్తున్నా నేటికీ పౌష్టికాహార పంపి ణీ జరగక పోవడంపై ఆయన ఆగ్ర హం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే ఫోన్‌లో సీడీపీవోతో మాట్లాడి పరిస్థితిని వివరించడమే కాకుండా బుధవారం తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారుల పని తీరును ఆయన పరిశీలించారు. రీ సర్వేపై వచ్చిన ఫిర్యాదులు.. పరిష్కారంపై అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమెల్యే వెంట సర్పంచ్ గొల్లు హేమతులసి, డీసీ ఛైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, నాయకులు సూర్రెడ్డి, తిరుమలరెడ్డి తదితరులున్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

**రాజమహేంద్రవరంలో ఏపీయూడబ్ల్యూజే ప్రదర్శన.. మంత్రి దుర్గేష్‌కు వినతి**



మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

రాజమహేంద్రవరం సిటీ ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజమహేంద్రవరంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్ వద్ద నుంచి యూనియన్ రాష్ట్ర నాయకుడు ఎం.శ్రీరామ్మూర్తి నేతృత్వంలో మంగళవారం ప్రెస్‌క్లబ్ నుంచి ప్రదర్శనగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని మెమోరాండమ్‌ను అందించారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ జర్నలిస్టుల డిమాండ్ డే సందర్భంగా ప్రదర్శన చేశామన్నారు. జర్నలిస్టులకు ఇప్పటికే అనేక సార్లు పొడిగిస్తున్న అక్రిడేషన్ల ప్రక్రియ కరెక్ట్ కాదని తక్షణమే కొత్త కార్డులు మం జూరు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇళ్ల స్థలాలు మంజూరు చే యాలని, రిటైర్డ్ జర్నలిస్టులకు పె న్షన్ పథకం ప్రవేశపెట్టాలని కోరారు. దీనిపై మంత్రి దుర్గేష్ స్పందిస్తూ రేపు జరిగే క్యాబినేట్ మీటింగ్‌లో ఈ అంశాలపై చర్చిస్తామని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇప్పటికే జర్నలిస్టుల సమస్యలపై అధ్యాయనం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కె.సారధి, ఏపీయూడబ్ల్యూజే నాయకులు అప్పలనాయుడు, ఫయాజ్, ఎన్ఎస్ఎన్ సత్యనారాయణ, కె.శ్రీనివాస్, జి.గోపి, రమేష్‌రాజా, పాలపర్తి శ్రీనివాస్, విశ్వనాథ్, మధు, ఆకుల ఈశ్వర్, ఫొటోగ్రాఫర్ బాబీ పాల్గొన్నారు.

**అనపర్తి:** అనపర్తి నియోజకవర్గ ప్రెస్‌క్లబ్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్‌లకు అందజేశారు. కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్ల నిరసన

గోకవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించడాన్ని నిరసిస్తూ గోకవరంలో మంగళవారం శ్రీజై భవాని పాసింజర్ ఆటో యూనియన్ కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు సుమారు 300 ఆటోలతో ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ చేపట్టారు. ఉచిత బస్సు పథకం అమలు కానున్న నేపథ్యంలో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తంచేశారు.

### మునికూడలిలో తాగుబోతుల వీరంగంపై ఫిర్యాదు


సీతానగరం,ఆగస్టు 4(అంధ్ర జ్యోతి) మునికూడలి గ్రామంలో కొందరు యువకులు తాగుడుకు బానిసై రాత్రుళ్లు వీరంగం చేస్తూ గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ అధ్యక్షుడు మల్లి మోహన్, సానిపిని రామారావు, జనసేన నాయకుడు కవల సురేష్ తదితరులు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కొందరు యువకులు జట్టుకట్టి తాగుడుకు బానిసై రాత్రుళ్లు గ్రామస్థులు భయపడే విధంగా ప్రవర్తిస్తున్నారని ప్రధాన రహదారిపై డివైడర్‌పై కూర్చుని ప్రయాణికులను ఇబ్బంది పెట్టడమే కాకుండా బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తాగుడుకు కేంద్రంగా చేసుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామంలో ఉన్న మంచినీటి ప్లాంట్ భవనానికి ఉన్న అద్దాలను రాళ్ళతో కొట్టి పగులగొట్టారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు. దీని విచారణ చేస్తామని హెచ్‌సీ తెలిపారు.

### సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

| | |
|---|---|
| శ్యామల | :సార్ మేడమ్ |
| సూర్యమినీ | :మహావతార్ నరసింహ |
| సూర్యప్యాలస్ | :కింగ్‌డమ్ |
| స్వామి | :హరిహర వీరమల్లు |
| అనుశ్రీ(సాయికృష్ణ) | :హరిహర వీరమల్లు |
| శివజ్యోతి | :సార్ మేడమ్ |
| రాజా | :కింగ్‌డమ్ |
| ఊర్వశి | :మహావతార్ నరసింహ |
| మేనక | :సన్ ఆఫ్ సర్దార్-2 |
| రంభ | :జూనియర్ |
| కుమారి | :---- |
| అప్సర | :కింగ్‌డమ్ |
| అశోక | :కింగ్‌డమ్ |
| వీఎస్ మహల్(నామవరం) | :కింగ్‌డమ్ |
| మురళీకృష్ణ(ధవళేశ్వరం) | :కింగ్‌డమ్ |
| వెంకటసూర్య(కడియం) | :కింగ్‌డమ్ |
| సత్యగౌరి (అనపర్తి) | :మహావతార్ నరసింహ |
| సూర్యశ్రీ (అనపర్తి) | : హరిహర వీరమల్లు |
| ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం) | : కింగ్‌డమ్ |
| రామకృష్ణ(కోరుకొండ) | :మహావతార్ నరసింహ |
| గీతాసినిమాస్ (సీతానగరం) | : మహావతార్ నరసింహ |
| శ్రీనివాస (గోకవరం) | : కింగ్‌డమ్ |
| టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం) | : మహావతార్ నరసింహ |
| లలితామహల్(రంపచోడవరం) | : హరిహర వీరమల్లు |
| నవయుగ(చింతూరు) | :హరిహర వీరమల్లు |

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



# తూర్పుగోదావరి
## జిల్లా వార్తలు



### నేడు రైల్వే జీఎం శ్రీవాస్తవ రాక

రాజమహేంద్రవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్(జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం జిల్లాకు రానున్నారు. ఉదయం తుని నుంచి 10 గంటలకు రాజమండ్రి రైల్వే స్టేషనుకు చేరుకుంటారు. అక్కడి నుంచి గోదావరి, కొవ్వూరు, నిడదవోలు రైల్వే స్టేషన్లలో తనిఖీలు నిర్వహించి మధ్యాహ్నానికి ఏలూరు వెళతారు.రానున్న పుష్కరాల నేపథ్యంలో వస్తున్నారు.

# ఒక్క రోజు తనిఖీ 193 బైక్‌ల సీజ్

- జిల్లా పోలీసుల కార్డన్ సెర్చ్
- అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు
- దాడుల్లో 225 మంది సిబ్బంది
- ధ్రువపత్రాల్లేని వాహనాలే టార్గెట్

రాజమహేంద్రవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసాంఘిక శక్తుల అణచివేత, శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ డీఎస్పీలు, సీఐల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలోని పోలీసులు బృందాలుగా ఏర్పడి అనుమానిత ప్రదేశాలకు తెల్లవారుజామునే చేరుకొని సోదాలు చేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 19 దీనిలో భాగంగా మంగళవారం త్రీటౌన్ పరిధిలోని లింగంపేటలో 31, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ శాటిలైట్ సిటీ సీ బ్లాక్‌లో 70, ధవళేశ్వరం ఐవోసీఎల్ కాలనీలో 30, గోకవరం డ్రైవర్స్ కాలనీలో 26, కొవ్వూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి ఇందిరమ్మ కాలనీలో 36 బైక్‌లు సీజ్ చేశారు. మొత్తం సరైన ధ్రువపత్రాలు లేని 193 ద్విచక్ర వాహనాలను, గోకవరంలో 5లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఆయా సోదాల్లో ఐదుగురు డీఎస్పీలు, సీఐలు 9, ఎస్ఐలు 18, పీఎస్ఐలు 7, స్పెషల్ పార్టీలు 2, శక్తి తదితర విభాగాల సిబ్బంది 184 మంది పాల్గొన్నారు. గోకవరం డ్రైవర్స్ కాలనీలో ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు.


### సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి



జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. సాధారణ జన జీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. చట్ట ఉల్లంఘనకు ప్రేరేపించే వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. సమస్యాత్మక ప్రాంతాలు, వ్యక్తులపై నిఘా పటిష్టం చేశాం. సోదాల్లో భాగంగా అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నిస్తు న్నాం. నాటుసారా, గంజాయి, మందుగుండు సామగ్రి, మద్యం అక్రమ నిల్వలను గుర్తించడానికి అణువణువూ నిశితంగా పరిశీలిస్తున్నాం. - ఎస్పీ నరసింహ కిషోర్



ధవళేశ్వరం, గోకవరంలో పోలీసులు సీజ్ చేసిన బైక్‌లు



# ముందడుగు!

## బార్లకు లాటరీ..

మద్యం షాపుల తరహాలోనే బార్లకు లాటరీ తీయాలని ప్రభుత్వం యోచిస్తోంది. జగన్ హయాంలో వేలం విధానంలో రెండేళ్ల పరిమితికి జారీ చేసిన లైసెన్స్‌లను గడువు ఈ నెల 31వ తేదీతో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త బార్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. లైసెన్స్ ఫీజుల నిమిత్తం రెండు ప్రతిపాదనలను ఎక్సైజ్ శాఖ సిద్ధం చేసింది. నగర పంచాయతీల్లో రూ.35 లక్షలు, మునిసిపాలిటీల్లో రూ.40 లక్షలు, నగరపాలక సంస్థల పరిధిలో రూ.45 లక్షలు మొదలు ప్రతిపాదన కాగా.. వరుసగా రూ.55 లక్షలు, రూ.65 లక్షలు, రూ.75 లక్షలు రెండో ప్రతిపాదనగా ప్రభుత్వం ముందుంచింది. అయితే ఖచ్చితంగా ఒక్కొక్క బారుకు నాలుగు దరఖాస్తులు పడాల్సిందేనన్న నిబంధన ఉంది. ప్రభుత్వం మొదటి ప్రతిపాదనకు మొగ్గు చూపుతుండగా ఆదాయం తగ్గుతుండడంతో ఏంచేయాలో ప్రశ్నార్థకంగా మారింది.ఆ అంతరాన్ని పూడ్చడానికి బార్‌ల సంఖ్య పెంచాలని భావిస్తున్నారు.ప్రస్తుతం తూర్పుగోదావరిలో 20, కాకినాడ జిల్లాలో 13, కోనసీమ జిల్లాలో 10 కలిపి మొత్తంగా 43 బార్లు ఉన్నాయి.ఈ సంఖ్య 60కి పెరిగే అవకాశం ఉంది.

## వచ్చే నెల ఒకటి నుంచి కొత్త బార్‌లు

మద్యం బార్ల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలసీకి రూపకల్పన చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో 2022-25 మధ్య అమలైన మద్యం బార్‌ల పాలసీ గడువు ఆగస్టు 31వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త మద్యం బార్‌ల పాలసీ అమలుకు గ్రీన్‌సిగ్నల్ పడింది. ముందస్తుగా ఈ పాలసీ అమలుకు రాష్ట్రంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి ఆ ఉపసంఘం ఇచ్చిన అధ్యయన నివేదిక ఆధారంగా కొత్త బార్ల పాలసీ అమలుకు శ్రీకారం చుట్టనుంది.ఈ పాలసీలో భాగంగా గీత కార్మికులకు 10 శాతం షాపులు కేటాయించనున్నారు.

(రాజమహేంద్రవరం/ అమలాపురం -ఆంధ్రజ్యోతి)

కొత్త బార్ పాలసీపై అబ్కారీ శాఖ దాదాపుగా కసరత్తు పూర్తి చేసింది.త్వరలో కొత్త బార్‌లకు నోటిఫికేషన్ వెలువడనుంది.జగన్ హయాంలో ఇచ్చిన బార్‌ల లైసెన్స్‌లకు ఈ నెలాఖరుతో కాల పరిమితి ముగుస్తుంది. దీంతో ఈ నెల 15వ తేదీలోగా కొత్త బార్‌లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది.సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్‌లు అందుబాటులోకి రానున్నాయి.మద్యం దుకాణాల కేటాయింపులో గీతకార్మికులకు ప్రభుత్వం 10 శాతం షాపులు కేటాయించింది. వీరికి లైసెన్స్ ఫీజు సైతం భారీగా తగ్గించింది. త్వరలో బార్ల లైసెన్సుల్లోను పదిశాతం కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించింది.

### దుకాణాల్లో ధరలకే

జగన్ హయాంలో బార్‌లలో ధరలను బార్లా తెరిచేశారు. అప్పటి ప్రభుత్వం ఇష్టానుసారం ధరలు పెంచుకోవచ్చని జీవో ఇవ్వడంతో అడ్డూ అదుపూ లేకుండా మందుబాబుల జేబులను గుల్ల చేశారు. వైసీపీ ప్రభుత్వం ఒకవైపు మద్యం ధరలను నూరుశాతం పెంచగా, బార్‌లలో దానిపై మరింత అదనంగా లాగేశారు. క్వార్టరుకు రూ.50-రూ.70, బీర్‌కి ఏకంగా రూ.100-రూ.120 తీసుకుంటూ దోపిడీ చేశారు. ఐదేళ్లూ ఈ దందా సాగింది.ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ దోపిడీకి కొత్త మద్యం పాలసీతో అడ్డుకట్ట వేసింది. బార్‌లలో కూడా దుకాణాల్లో ధరలనే అమలు చేయాలని నిర్ణయానికి వచ్చింది. దుకాణాల కంటే 10 శాతం ఎక్కువ ధర చెల్లించి బార్‌లు ప్రభుత్వ మద్యం డిపోల నుంచి కొనుగోలు చేస్తాయి.బార్‌లలో కూడా దుకాణాల ధరే నిర్ధారిస్తే ఆ శాతాన్ని ప్రభుత్వం నష్టపో వాల్సి ఉంటుంది. దరఖాస్తు రుసుం రూ.5 లక్షలు ఉంటుందని చెబుతున్నారు.

### పర్మిట్ రూంలు కూడా

జగన్ జమానాలో పిచ్చి బ్రాండ్లతో ఎంత ఆదాయం వచ్చిందో.. ఇప్పుడు దాదాపు 200 రకాల నాణ్యమైన బ్రాండ్లు ఉన్నా అంతే రాబడి నమోదవుతోంది. బీర్లలో పెరుగుదల కనిపిస్తే ఆ మేరకు మిగతా మద్యం బ్రాండ్లలో తరుగుదల నమోదవుతోంది.దీంతో ఆదాయం ఆశాజనకంగా ఉండడం లేదు. దీనిపై ప్రభుత్వం విశ్లేషణ చేయగా పర్మిట్ రూమ్‌లు లేకపోవ డమే ఒక కారణమని తేలింది. ప్రస్తుతానికి అనధికారిక సిట్టింగ్‌లను చూసీచూడనట్టు వది లేస్తున్నా.. ఆదాయం మెరుగుపడడం లేదు.బార్‌ల లైసెన్స్‌ల మాదిరిగానే పర్మిట్ రూంలకు ఈ సెప్టెంబరు నుంచి అనుమతులిచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది.ఉమ్మడి జిల్లాలో 452 మద్యం దుకాణాలు ఉన్నాయి. 2019కి ముందు అన్ని షాపులకు ఏడాదికి రూ.5 లక్షలు ఫీజుగా ఉండేది. ఇప్పుడు దానిని రెండు కేటగిరీలుగా చేయనున్నారు.మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.7.5 లక్షలు, మిగతా ప్రాంతాల్లో రూ.5 లక్షల ఫీజు విధించే అవకాశం ఉంది. ఉమ్మడి తూర్పులో కాకినాడ,రాజమహేంద్రవరం కార్పొరేషన్లు కాగా.. మిగతావి మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు ఉన్నాయి. బార్‌లు, పర్మిట్ రూంలకు ఒకేసారి నోటిఫికేషన్ ఇస్తారా? లేదా వేర్వేరుగా విడుదల చేస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

- లాటరీ విధానంలో కేటాయింపు
- 10 రోజుల్లో నోటిఫికేషన్ విడుదల
- ఉమ్మడి జిల్లాలో 60 బార్లు
- దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు?
- బారుకు 4 దరఖాస్తులు తప్పనిసరి
- లైసెన్స్ ఫీజు రూ.45 లక్షలు
- మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులు
- పర్మిట్ రూంలకు అవకాశం
- ఈ నెల 31తో బార్ల గడువు ముగింపు

### నాడంతా బార్లా

కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రాష్ట్రప్రభుత్వం త్వరలో బార్ లైసెన్సుల జారీకి సిద్ధమవుతోంది. బహిరంగ వేలం ద్వారా కోట్లలో ఆదాయం వచ్చే ఛాన్స్ ఉన్నా అదేదీ కాదనుకుని లాటరీ ద్వారా బార్ల జారీకి సన్నాహాలు చేస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం బార్ల కేటాయింపులో అడ్డగోలుగా వ్యవహరించింది. భారీ అప్‌సెట్ ధరలను నిర్ణయించి వ్యాపారుల మధ్య పోటీ పెంచింది. అదేసమయంలో అప్పటి అధికారపార్టీ నేతలు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేశారు. బార్ల వ్యాపారులను సిండికేట్ చేసి వారి నుంచి తక్కువ ధరకు కోట్ చేయించి తద్వారా వారి నుంచి లాగేశారు. తద్వారా పోటీ లేకుండా తక్కువ ధరకే వైసీపీ అనుకూల వ్యాపారులు 2022 నుంచీ బార్లు నిర్వహిస్తూ భారీగా సంపాదిస్తున్నారు. గతంలో ఒక్కో బార్‌కు ప్రభుత్వం రూ.35లక్షల ప్రారంభ ధర నిర్ణయిస్తే ఏరియా ఆధారంగా వేలంలో రూ.కోటికిపైగా పలకాల్సింది.కానీ నేతలు,వ్యాపారులు సిండికేట్ అయి అప్‌సెట్ ధరకు పదిశాతం కూడా అదనంగా రాకుండా చేసి ఉమ్మడి జిల్లాలో అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధులు భారీగా సంపాదించారు. ఒక్క కాకినాడ జిల్లాలో 15 బార్లకు వేలం నిర్వహించారు.ఒక్క కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 11 బార్‌లను తక్కువ ధరకు లాగేసుకున్నారు.పోటీ పెరగకుండా ఉండేం దుకు పదకొండు బార్‌లకు పద్దెనిమంది బరిలో ఉంటే అప్పటి సిటీ ఎమ్మెల్యే ద్వారం పూడి ఏడుగురిని దారికి తెచ్చారు. వేలం నుంచి పోటీదారులను తప్పించి ఒక్కో బార్ కు రూ.35 లక్షల ప్రారంభ ధరగా ప్రభు త్వం నిర్ణయిస్తే కేవలం రెండు లక్షలే అదనం గా వేసి రూ.37లక్షలకు కోట్ చేశారు. తద్వా రా భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది.

# కడియపులంక సర్పంచ్‌గా పద్మావతి

## 2 నామినేషన్లు - ఒకరు విత్‌డ్రా - ఏకగ్రీవంగా ఎన్నిక

కడియం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కడియపులంక సర్పంచ్‌గా మాదిశెట్టి పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి, స్టేజ్ -1 రిటర్నింగ్ ఆఫీసర్, మండల విద్యాశాఖ అధికారి మణికుమార్ మంగళవారం ప్రకటించారు. ఆయన తండ్రి వార్డు సభ్యుడు మార్గాని ఏడుకొండలు, కంఠంశెట్టి సుబ్రహ్మణ్యం తదితరుల సమక్షంలో మాదిశెట్టి పద్మావతి సర్పంచ్‌గా ఎన్నికైన ధ్రువపత్రాన్ని అందుకున్నారు.సర్పంచ్ ఎన్నికల్లో కడియపులంక సర్పంచ్ స్థానం బీసీ మహిళకు కేటాయించడంతో మార్గాని అమ్మాణీ పోటీ చేసి విజయం సాధించారు. మండల జడ్పీటీసీ స్థానం బీసీ మహిళకు కేటాయించడంతో కూటమి తరఫున పోటీ చేసి జడ్పీటీసీ పదవిని దక్కించుకున్నారు. అయితే రెండింటిలో ఓ పదవికి రాజీనామా చేయాలనడంతో జడ్పీటీసీ పదవికి రాజీనామా చేశారు. సర్పంచ్ పదవిలో ఉండగానే గుండెపోటుకు గురై అమ్మాణీ అకస్మాత్తుగా మృతిచెందారు. దీంతో సర్పంచ్ స్థానం ఖాళీ అయ్యింది. ఇదిలా ఉండగా ఇటీవల సర్పంచ్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 10వ తేదీన ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు అమ్మాణీ కుమార్తె మాదిశెట్టి పద్మావతి నామినేషన్, వీరి సమీప బంధువు మార్గాని సత్యవేణి మరో నామినేషన్ వేశారు. మార్గాని సత్యవేణి తన నామినేషన్ ఉపసంహరించుకోవడంతో రేసులో ఒకరే నిలిచారు. ఈ నేపథ్యంలో మాదిశెట్టి పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు.



ధ్రువీకరణపత్రం అందుకుంటున్న పద్మావతి

### అమ్మ స్థానంలోకి రావడం ఆనందం



కడియపులంక సర్పంచ్ పదవిలో ఉండగానే మా అమ్మ అమ్మాణీ మమ్మల్ని వదిలి వెళ్లి పోయారు. నా తండ్రి ప్రోత్సాహం, గ్రామస్తుల సహకారంతో నేను సర్పంచ్‌గా పోటీ చేశా. గ్రామస్తులు తిరిగి నాకు సర్పంచ్ పదవి కట్టబెట్టారు.అమ్మ స్థానంలోకి నేను రావడం ఆనందంగా ఉంది. కానీ అమ్మలేని లోటు తీరనిది. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధికి కృషి చేస్తా.

- మారిశెట్టి పద్మావతి, సర్పంచ్

# బంగారు కుటుంబాల మ్యాపింగ్‌పై సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల మ్యాపింగ్ ఆగస్టు 15వ తేదీలోపు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం చంద్రబాబు పీ-4 తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. 2028 నాటికి పేదరిక నిర్మూలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 66 వేల కుటుం బాలు లక్ష్యం కాగా 60 వేలు కుటుంబాలను గుర్తించామన్నారు.5 వేల కుటుంబాలకు మార్గదర్శకులను మ్యాపింగ్ చేశామన్నారు. మిగిలిన కుటుంబాలను ఆగస్టు 15లోగా గుర్తించి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.ఈ మేరకు బి ఫోర్ నీడ్ బెస్ట్ సర్వేను వేగంగా పూర్తి చేయాలన్నారు.ప్రతి 25 కుటుంబాలకు సచివాలయ సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో సీతారామ్మూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్, సీపీవో అప్పలకొండ, డీఎల్‌డీవో వీణాదేవి తదితరులు పాల్గొన్నారు.

### 'రండి! టీ తాగుతూ మాట్లాడుకుందాం'

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం మంగళవారం జిల్లాలో విజయవంతమైందని సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని 14 ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులు వారికి చెల్లించాల్సిన బకాయిలపై తమ సూచనలు అందించారు.




### 'నాణ్యతగా ఉంటేనే నిత్యావసరాలు ఇవ్వండి'

గోపాలపురం, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): నిత్యావసరాల సరఫరాలో నాణ్యత పాటించాలని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గణేశ్ అన్నారు. ఏఎంసీ ఆవరణలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ గోదామును మంగళవారం పరిశీలించారు. సరుకుల్లో నాణ్యత లోపిస్తే తన దృష్టికి తెచ్చి వెనక్కి పంపించాలని ఆదేశించారు. ప్రతి నెల స్టేజ్ టూ నుంచి సరుకులను 15వ తేదీ నుంచి 25వ తేదీ లోగా డీలర్ పాయింట్లకు చేర్చాలన్నారు. గోదాములో కందిపప్పు, పంచదార పరిశీలించి తొలగించాలన్నారు.

### స్మార్టుమీటర్లు వద్దు..

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : స్మార్టు మీటర్ల బిగింపు తక్షణం ఆపాలని, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు, విద్యుత్ ఛార్జీల పెంపుదలను ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జాంపేటలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట మంగళవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, నాయకులు పూర్ణిమరాజు, ఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## తొలి అడుగులో అడుగేస్తూ!

దేవరపల్లి మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు మంగళవారం అట్టహాసంగా సాగింది. వేలాదిగా నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వెంట నడిచారు..అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. గోపాలపురం నియోజకవర్గం రాష్ట్రంలోనే 8వ స్థానంలో నిలిచిందని తెలిపారు.



# దేవుడి.. సేవకులు!

## ఆలయ ట్రస్ట్ బోర్డులకు గ్రీన్‌సిగ్నల్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నామినేటెడ్ పోస్టులకు కూటమి సభ్యుల నుంచి తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటికే కొన్ని సొసైటీలకు త్రీమన్ కమిటీలను నియమించిన సంగతి తెలిసిందే.పలు మార్కెట్ కమిటీలను నియమించారు. దేవస్థాన కమిటీల జాతర మొదలైంది. జిల్లాలో పార్టీకి సేవ చేసిన నేతలు, కార్యకర్తలు ఏదో విధంగా గుర్తింపు కావాలని ఎదురు చూస్తున్నారు. వారిలో చాలా మందికి దేవాలయ ట్రస్టుబోర్డుల్లో స్థానం లభించనుంది.రాజమహేంద్రవరంలో మూడు కమిటీల నియామకం పూర్తయింది.ఈ నెలాఖరుకి ఉమ్మడి జిల్లాతో పాటు కొవ్వూరు డివిజన్ లోనూ మొత్తం కమిటీలను ప్రకటించేందుకు కసరత్తు జరుగుతుంది. ఎమ్మెల్యేలు ఇప్పటికే పార్టీల అధిష్ఠానానికి కమిటీల వారీ పేర్లను ప్రతిపాదించి పంపారు. అధిష్ఠానం పరిశీలించి అధికారికంగా ప్రకటించనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేలాది మంది తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నేతలు, కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు దక్కనున్నాయి. ఈ సారి ఎక్కువ దేవాలయాలు మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆధిపత్యంలో ఉండనున్నాయి.

### కూటమి ఏం చేస్తుందో..

గత వైసీపీ హయాంలో ఏం జరిగిందో కానీ రూ.5 లక్షల కంటే తక్కువ ఆదాయం ఉన్న దేవాలయాలకు ట్రస్టుబోర్డుల నియామకం వద్దని సుప్రీంకోర్టు ఆర్డర్ ఇచ్చింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో రూ.5లక్షల ఆదాయం కంటే తక్కువ ఆదాయం వచ్చేవి సుమారు 590 వరకూ ఉన్నాయి. అంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చేవి 37 ఉన్నాయి. ఈ రెండు కేటగిరీలనే పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని రూ. 5 లక్షల్లోపు ఆదాయం ఉన్న వాటిని పరిగణనలోకి తీసుకునేటట్టు కోర్టు నుంచి ఏమైనా ఆర్డర్ తెచ్చుకుంటే సుమారు 1713 దేవాలయాలకు కమిటీలను నియమించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం సుమారు 590 దేవాలయాలకు మాత్రం కమిటీలు వేసే ఆలోచన జరుగుతోంది. గత నెలలో సీఎం చంద్రబాబు స్వయంగా ఈ కమిటీలకు పేర్లను ప్రతిపాదించాలని ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలకు సూచించిన సంగతి తెలిసిందే.దీంతో ఇప్పటికే సందడి మొదలైంది.

### ట్రస్ట్‌బోర్డుకు 9 మంది..

ఒక్కో దేవాయలయానికి 9మంది ట్రస్ట్‌బోర్డు సభ్యులను ప్రభుత్వం నియమించనుంది. మొదట 11 మందితో నియమించాలని భావించినా ఎందుకో 9కి తగ్గించింది. ఒకరు చైర్మన్, మిగతావారు సభ్యులు ఉంటారు. దీని వల్ల వేలాది మంది కార్యకర్తలకు పదవులు దక్కనున్నాయి.ఇందులో టీడీపీకి అధికంగా, తర్వాత స్థానం జనసేనకు, మూడో స్థానం బీజేపీకి దక్కనున్నాయి. తెలుగుదేశం పార్టీకి దక్కిన కమిటీల్లో ఒకరు జనసేన, ఒకరు బీజేపీ సభ్యులు ఉంటారు. ప్రతి కమిటీలోనూ నలుగురు మహిళలు ఉంటారు. ఈ సారి ట్రస్ట్ బోర్డుల్లో 50 శాతం మహి ళలకు కేటాయించనున్నారు. 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించనున్నారు.ఈసారి కొత్తగా నాయీ బ్రాహ్మణులు ఒకరు, బ్రాహ్మణ వర్గానికి చెందిన వారు ఒకరికి స్థానం కలిగించేలా ప్రభుత్వం చట్టం చేసింది.ప్రతి కమిటీలోనూ ఆయా దేవాలయాల పూజారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. దేవాలయ ట్రస్ట్ బోర్డు కమిటీల్లో మందు తాగే అలవాటు ఉన్నవారికి అవకాశం లేదు. హిందువై ఉండాలి. కనీసం 25 ఏళ్ల వయసు నిండి ఉండాలి.క్రిమినల్ కేసులు ఉండకూడదు. ఆలయ భూమి లీజుదారులై ఉండకూడదు. ట్రస్టు బోర్డు సభ్యులెవరికీ గౌరవ వేతనం ఉండదు. ఆలయ అభివృద్ధి,దేవునికి సేవ చేయడమే ప్రధాన లక్ష్యం.

### ఉమ్మడి జిల్లాలో 1713 ఆలయాలు..

ఉమ్మడి జిల్లాలో గుర్తింపు పొందిన ఆలయాలు 1713కు పైగా ఉన్నాయి. అందులో ఐదు లక్షల కంటే ఎక్కువ వార్షికాదాయం ఉన్న దేవా లయాలు 590 ఉన్నాయి.రూ.50 వేల నుంచి రూ.కోట్లలో ఆదాయం ఉన్నవి 370 ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాలో రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య ఆదాయం కలవి 127 ఉన్నాయి. తక్కువ ఆదాయం కలవి 68 ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రూ.5 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవి 226, రూ.కోట్లలో ఆదాయం ఉన్నవి 19 ఉన్నాయి. మొత్తం అన్నిరకాలు కలిసి 611 ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 5 లక్షల కంటే ఎక్కువ ఆదాయం కలవి 200, పెద్దవి 11 ఉన్నాయి. అన్ని రకాలు కలిపి 900 ఉన్నాయి.

- నామినేటెడ్ పదవులకు తీవ్ర పోటీ
- ట్రస్ట్ బోర్డు కమిటీలపైనా దృష్టి
- ఉమ్మడి జిల్లాలో 1713 ఆలయాలు
- వేలాది మందికి అవకాశం
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఛాన్స్
- మహిళలకు 50శాతం
- రాజమండ్రిలో మూడు కమిటీలు

### నేడు, రేపు సీపీఐ జిల్లా మహాసభలు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ తూర్పుగోదావరి జిల్లా 26వ మహాసభలు ఈ నెల 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలిరోజు బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు చర్చిగేటు నుంచి ప్రజాప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. ఆనం కళాకేంద్రం వద్దనున్న సుబ్రహ్మణ్యమైదానంలో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. బహిరంగసభకు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర నేతలు జేవీ సత్యనారాయణమూర్తి, అక్కినేని వనజ, రావులపల్లి రవీంద్రనాథ్ హాజరవుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా జిల్లాలో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు.



### నిలకడగా గోదావరి

ధవళేశ్వరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం ధవళేశ్వరం వద్ద నిలకడగా కొనసాగుతుంది. మంగళవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ద్వారా 1,78,215 క్యూసెక్కులను దిగువకు విడిచిపెడుతున్నారు.ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 5 వేల క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 2700 క్యూసెక్కులు,పశ్చిమడెల్టాకు 7 వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నాచేస్తున్న పీవోడబ్ల్యు, ఐఎఫ్‌టీయూ నాయకులు, వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

# స్మార్ట్ మీటర్లు వద్దు

● ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

కొవ్వూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ వినియోగదారులను నిలువుదోపిడీ చేస్తుందని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఈమని మల్లిక అన్నారు. పీవోడబ్ల్యు, ఐఎఫ్టీయూల సంయుక్త ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రాష్ట్ర ప్రజావేదిక పిలుపుమేరకు అదాని స్మార్ట్ మీటర్లను బిగించరాదని, ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని మంగళవారం ధర్నా చేశా రు. అనంతరం ఏఈ కార్యాలయంలో వినతిపత్రంఅందజేశారు. మల్లిక మాట్లాడుతూ అధిక విద్యుత్ బిల్లులు వచ్చే స్మార్ట్ మీటర్లను బిగించరాదని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో మల్లిక, భవాని, సత్య, సాయి, హరీష్, సుబ్బారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

**స్మార్ట్ మీటర్ల బిగింపు విరమించుకోవాలి**

**దేవరపల్లి:** గృహాలకు స్మార్ట్‌మీటర్లు బిగించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం కార్యదర్శి ఎస్.భగత్ అన్నారు. దేవరపల్లిలో సీపీఎం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్.భగత్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వలన విద్యుత్ చార్జీలు ఏమాత్రం తగ్గవని మీటర్ల భారం ప్రజలపై పడుతుందన్నారు. అ దాని కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా రాష్ట్ర కూటమి ప్రభు త్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ఇప్ప టికే సర్దుబాటు ఛార్జీల పేరుతో వేలకోట్ల రూపాయలు ప్రజలపై భారం మోపారని అన్నారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ శాఖాధికారులకు అందజేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘం నాయకు లు రత్నాజీ, అయినపర్తి శ్రీనివాసరావు, పెంట య్య, అడపా సూర్యారావు, పుల్లయ్య, చిరంజీవి, చిడిపి వెంకాయమ్మ, దుర్గా పాల్గొన్నారు.

**స్మార్ట్ మీటర్లు వద్దు:ఐఎఫ్‌టీయూ**

**నిడదవోలు:** స్మార్ట్‌మీటర్ల బిగింపు ద్వారా ప్రజల జేబులు కొల్లగొట్టేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కా ర్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. మంగళ వారం నిడదవోలు పట్టణంలోని విద్యుత్ శాఖా కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో విద్యు త్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖకు ఇప్పటికే ట్రూ అప్ చార్జీలు, అధిక కరెంటు బిల్లులు చెల్లిం చలేక ప్రజలు ఆందోళన చెందతున్నారని ఇలాంటి సమయంలో స్మార్ట్ మీటర్లు తీసుకురావడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు మల్లిడి రామిరెడ్డి, మల్లిడి పోశియ్య, పి.మోహన్ సారధి, గాలి గనిరాజు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, పాల్గొన్న ప్రజలు

# కార్యకర్తలే టీడీపీకి బలం

● తొలి అడుగు బహిరంగసభలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



ఎమ్మెల్యే మద్దిపాటిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

దేవరపల్లి, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశంపార్టీకి కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. దేవరపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోనే తొలిఅడుగు నూరు శాతం పూర్తిచేసుకుని రాష్ట్రంలోనే 8వ స్థానంలో నిలిచింది. ఈతొలిఅడుగు బ్రహ్మాండమైన బహిరంగసభ ర్యాలీకి నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. కరుటూరి ఫంక్షన్‌హాలు నుంచి కాకర్ల ఫంక్షన్‌హాలు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద జరిగిన బహిరంగసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ పార్టీలోనైనా నాయకులు మారుతుంటారు. కానీ కార్యకర్తలు అంకితభావంతో పార్టీకి నిలబడి ఉంటారని అన్నారు. టీడీపీ పార్టీ అండాదండా కార్యకర్తలేనని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లలో విధ్వంస పాలన, అవినీతి, అరాచకపాలన వలన రాష్ట్రం అభివృద్ధి అదోగతి పాలైందన్నారు. రాష్ట్రంలో ఎన్నో ఒడిదుడుకులు ఉన్నప్పటికి సీఎం చంద్రబాబునాయుడు సమర్ధమైనపాలనతో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలుచేసే ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జగన్‌రెడ్డి తల్లినిచెల్లిని బయటకు గెంటేసిన ఆయన ప్రజలకు ఏం న్యాయంచేస్తారని విమర్శించారు. సొంత బాబాయ్‌నే హత్య చేయించిన జగన్‌రెడ్డి ఆ పార్టీ పత్రిక బాబాయ్ గుండెపోటుతో మరణించాడని అసత్యరాతలు రాశారన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి టీడీపీతో పాటు జనసేన, బీజేపీ చేసిన కృషితో 164సీట్లు గెలుపొందామన్నారు. తాను పవన్ కల్యాణ్ అభిమానినని ప్రధానిని మెచ్చిన గొప్ప నాయకుడు పవన్‌కల్యాణ్ అని ఆయన చేసిన సేవలుకొనియాడారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు గూండాయిజం చెలాయిస్తే రప్పరప్పా ఆడిస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఐదు కోట్లతో దేవరపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మద్దిపాటిని నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనీల్, టీడీపీనాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, రాంబాబు, కొయ్యలమూడి చినబాబు, కొయ్యలమూడి సుధారాణి, ఉప్పులూరి రాంబాబు, గద్దే సుబ్రహ్మణ్యం, మూడు మండలాల టీడీపీ అధ్యక్షులు సత్యనారాయణ, కొర్లపాటి శ్రీరామచంద్రమూర్తి, లంకా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్య

కొవ్వూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వివాహిత లాడ్జి రూములో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడజిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ సమీపంలోని కుతుకుడుమిల్లి గ్రామానికి చెందిన కాసా శివాని వయస్సు (30 )ఉం టుంది. ఈనెల 4వ తేదీ రాత్రి కొవ్వూరు ప ట్టణంలోని మెయిన్‌రోడ్‌లో ఉన్న సాయిలక్ష్మి లాడ్జిలో దిగింది. మంగళవారం రాత్రి అయినా తలుపులు తెరవకపోవడంతో లాడ్జి సిబ్బంది అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టణ సీఐ విశ్వం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తెరవడంతో మహిళ లాడ్జి రూములో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. లాడ్జిలో అందించిన ఫోన్ నంబరు ఆధారంగా మహిళకు సంబంధించిన బంధువుల ఆచూకీ తెలుసుకుని శివాని మృతి చెందిన సంఘటనను వారి బంధువులకు తెలియజేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది. ఇదిలావుండగా మృతురాలి శివాని కుటుంబ కలహాలతోనే విరక్తి చెంది ఉరి వేసుకుని ఉంటుందని సమాచారం.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని కర్ణాటక లారీ క్లీనర్ మృతి



కొవ్వూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని కర్ణాటకకు చెందిన లారీ క్లీనర్ మృతి చెందినట్లు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కర్ణాటకలోని కొలార్ పట్టణంలోని రామత్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ సయ్యద్ రోషన్‌పాష, క్లీనర్ సయ్యద్ సాదిక్‌లు జూలై 31న కెమికల్ లోడ్ వేసుకుని బెంగులూరు నుంచి వైజాగ్ బయలుదేరారు. ఈనెల 4వ తేదీ రాత్రి 7-15 గంటల సమయంలో కొవ్వూరు మండలం గోవర్ధనగిరిమెట్ట వద్ద లారీని రోడ్డు ప్రక్కన పార్క్‌చేసి భోజనానికి దిగారు. క్లీనర్ సయ్యద్ సాదిక్(42) రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాదిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ సయ్యద్ రోషన్‌పాష అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు.

## ప్రజల చేతిలో ప్రభుత్వం



వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ

నిడదవోలు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలో వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల చేతిలో ప్రభుత్వమని రాష్ట్ర ప్రభుత్వ సేవలు అందుకునేందుకు 9552300009 నెంబరును అందుబాటులోకి తీసుకు వచ్చిందని అన్నారు. ఈ నెంబరు ద్వారా 200 పైగా సేవలు అందుబాటులో ఉం టాయన్నారు. ఈ అవగాహన ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, బీజేపీ నాయకులు నీలం రామారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## తల్లిపాలతోనే నవ శిశువు ఆరోగ్యం

చాగల్లు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన చాగల్లులోని సెంటర్ 64లో తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించి నవశిశువుకు తల్లిపాలు ప్రాధాన్యం గురించి తల్లులకు వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కె.నాగలక్ష్మి, సూపర్‌వైజర్లు పి.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలు లేని సమాజ నిర్మాణానికి సహకరించాలి

● కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్



కొవ్వూరు ఇందిరమ్మకాలనీలో కార్డన్ అండ్ సెర్చ్‌లో పాల్గొన్న డీఎస్పీ దేవకుమార్, సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులు

కొవ్వూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు లేని సమాజ నిర్మాణానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు మంగళవారం కొవ్వూరు పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ తనిఖీలను చేపట్టారు. డీఎస్పీ జి.దేవకుమార్ ఆధ్వర్యంలో సబ్ డివిజనల్ పోలీసు సిబ్బంది ఉదయం 4-30నుంచి కాలనీలోని ప్రతి ఇంటినీతనిఖీ చేశారు. అను మానం కలిగిన వ్యక్తుల వేలిముద్రలు సేకరించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగంపై ఆరాతీశారు. డీఎస్పీ జి.దేవకుమార్ మాట్లాడుతూ బయటనుంచి క్రిమినల్ రికార్డు కలిగిన వ్యక్తులు, అనుమానితులు షెల్టర్ పొందుతున్నారా, స్థానికంగా ఉన్న సస్పెక్టెడ్ పర్సన్స్, ఆయుధాలు, అనధికార వాహనాలు, బయటనుంచి వచ్చి ఎవరైనా షెల్టరు పొందుతున్నారా, డ్రగ్స్, గంజాయి వంటి నిల్వచేసి విక్రయించడం, సేవించడం వంటి అంశాలపై తనిఖీలు చేశామన్నారు. ఈ తనిఖీలలో నంబరులేని, రికార్డులులేని 29 ద్విచక్ర వాహనాలను గుర్తించి, స్టేషన్‌కు తరలించారు. వాటిని పరిశీలించి దొంగతనాలకు గు రైనా వాహనాలు, కేసులలో ఉన్న వాహనాలు ఉన్నట్లయితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు చూపించి తీసుకువెళ్లాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానంగా సంచరిస్తున్న, మాదక ద్రవ్యాలు విక్రయించినా, నడవడికలో తేడాలు ఉన్నా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సీఐ పి.విశ్వం, ఎస్‌ఐ కె.శ్రీహరిరావు, ఎస్‌ఐలు పి.రవీంద్ర, టి.రామకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

● ఎమ్మెల్యే ముప్పిడి



చాగల్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంను సందర్శించిన ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి రూ.3 కోట్లు నిదులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరికి ప్రతిపాదనలు అందజేశారు. మంగళవారం రాజమహేంద్రవరంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరిని కలిసి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు డ్రైన్లు, సీసీ రోడ్లు, బ్యూటిఫికేషన్ కోసం రూ.3కోట్లు రుడా నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని పాల్గొన్నారు.

**విద్యా, వైద్యంపై కూటమి ప్రభుత్వం శ్రద్ధ**

**చాగల్లు:** విద్యా, వైద్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన చాగల్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాగల్లు, తాళ్ళపూడి వంటి మండల కేంద్రాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో కనీస వసతులు మెరుగుపరిచే విధంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రి భవనం శ్లాబ్ లీకు కావడం, మరు గుదొడ్లు సక్రమంగా పనిచేయకపోవడం, ఆరోగ్యకేంద్రం ఆవరణంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి విషసర్పాలు సంచరించడం వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆసుపత్రి ప్రాంగణంలో పిచ్చి మొక్కలు తొలగించాలని, మరుగు దొడ్లను మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శి మొహ్మద్ ఆలీని ఆయన ఆదేశించారు. శ్లాబ్ నీరు కారకుండా కొత్తగా వచ్చిన పెయింట్ వేయించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వోతో ఫోన్‌లో మాట్లాడి ఆసుపత్రి అభివృద్ధికి కనీస వసతుల కల్పనకు తగినచర్యలు తీసు కోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు, తహసీల్దార్ ఎం.మెరికమ్మ, డాక్టర్లు టి.మనోజ్, తనూజ పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

మండలంలోని ఎస్.ముప్పవరం, చిక్కాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు ఎమ్మెల్యే కరపత్రాలు పంచుతూ వివరించారు. అర్హులైన ప్రతివారికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.

## జీడిమామిడిలో సస్యరక్షణతోనే అధిక దిగుబడి

● జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు



గోపాలపురంలో జీడితోటలు పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు

గోపాలపురం, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): జీడి మామిడిలో సస్యరక్షణతోనే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి ఎస్.మల్లికార్జునరావు అన్నారు. గోపాలపురం గ్రామానికి చెందిన ముప్పన రమణారెడ్డి జీడి తోటలను మంగళవారం ఆయన సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ జీడిమామిడిలో సస్యరక్షణలు తప్పనిసరి అన్నారు. రైతులు ప్రతీ ఏటా జీడిమొక్కలకు ఎండికొమ్మలను వయస్సుమీరిన కాపుకాయని చెట్టుకొమ్మలను కత్తిరించాలని అన్నారు. దానికి బోర్డ్ ఆఫ్ మిశ్రమాన్ని పూయాలని సూచించారు. అదే విధంగా జీడిమామిడి తోటలో పురుగులు, జీడి తోటలను ఆశించే పురుగుల నివారణ పై రైతులకు వివరించారు. వీటితో పాటు ఉద్యానశాఖలో ప్రభుత్వం అందిస్తున్న వివిధ రాయితీల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో దేవరపల్లి ఉద్యాన శాఖాధికారి రమేశ్, ఉద్యాన సిబ్బంది, పాల్గొన్నారు.

**బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించాలి**

కొవ్వూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.వెంకటపద్మిని ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. పంగిడి బీసీ, ఓసీ ఏరియాలోని వాటర్‌ట్యాంకు వద్ద అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.వెంకటపద్మిని మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలను అందించాలన్నారు.

## సీఎం చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ చైర్మన్, నియోజవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మంగళవారం సెక్రటేరియట్‌లో కలిశారు. నిడదవోలు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి, అదేవిధంగా పలు సమస్యలపై శేషారావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రాలు అందజేశారు. సీఎం చంద్రబాబు వాటిని పరిశీలించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారని శేషారావు చెప్పారు.



సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

# వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు అందించాలి

● కొవ్వూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోర్కెల దినం

● ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రం



కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రం అందజేస్తున్న కొవ్వూరు ప్రెస్‌క్లబ్ సభ్యులు

కొవ్వూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేయడంతో పాటు జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను సత్వరం పరిష్కరించాలని కొవ్వూరు ప్రెస్‌క్లబ్ నాయకులు వీఆర్‌వీ ప్రసాద్, జి.సత్యనారాయణలు డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యుజె రాష్ట్రకమిటీ పిలుపుమేరకు మంగళవారం కొవ్వూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త కోర్కెల దినాన్ని పాటించారు. అనంతరం కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రాన్ని అందజేశారు. జి.సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో 23000ల మంది అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులు ఉండగా గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలు నిబంధనలతో 9వేలకు కుదించిందన్నారు. పాత అక్రిడిటేషన్‌లు గడువు పూర్తయినా పదే పదే పొడిగిస్తున్నారని, ఇకనైనా కొత్త కార్డులు అందజేయాలన్నారు. అక్రిడిటేషన్ కమిటీలో యూనియన్ నాయకులకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. కొత్తకార్డులు అందించకపోవడంతో హెల్త్ కార్డులు పొందే అవకాశం కోల్పోయారన్నారు. వీఆర్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమును మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని, స్కీం అమలులో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సమాచారశాఖ అధికారులు, యూనియన్ నాయకులతో త్రైపాక్షిక పర్యవేక్షక కమిటీ వేయాలన్నారు. అదేవిధంగా ప్రమాద బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలన్నారు. కట్టా దేవదాసు మాట్లాడుతూ అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. విశ్రాంత జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాలలో మాదిరిగా ఏపీలోను పాత్రికేయ పింఛన్‌ను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో, తోట అవినాష్, జి.ఎర్రన్న, బి.భాను, జి.సూర్య సందీప్, సీహెచ్.చరణ్ తదితరులు పాల్గొన్నారు.

**జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి**

**దేవరపల్లి:** తూర్పుగోదావరి జిల్లా ఏపీ డబ్ల్యూజే జిల్లా కమిటీ ఆదేశాల మేరకు మంగళవారం దేవరపల్లి మండలంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు. జర్నలిస్టుల డిమాండ్ డే సందర్భంగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పాత్రికేయులు కే.వెంకటేశ్వరరావు, చిటికన కృష్ణ, తోట సత్యనారాయణ, చిన్నం వెంకటేశ్వర్లు, ఎస్‌కే.బాష, యూవీవీ ప్రసాద్, నరిపల్లి నాగార్జున, సుంకర మురళీ, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

## బెస్ట్ సహకార సంఘంగా దొమ్మేరు సొసైటీ



మంత్రి అచ్చెన్నాయుడి నుంచి అవార్డు అందుకుంటున్న సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు

కొవ్వూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బెస్ట్ పీఏసీఎస్‌గా దొమ్మేరు సొసైటీని ఎంపికచేసి అవా ర్డు అందజేశారు. ఈనెల 4వ తేదీన విజయవా డ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆప్కాబ్ 62వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఉత్తమ పనితీరు కనబర్చిన సొసైటీలకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో అందించిన సేవలకుగాను దొమ్మేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి బెస్ట్ పీఏసీఎస్‌గా అవార్డును అందజేశారు. ఈ అవార్డును రాష్ట్ర సహకారశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు చేతుల మీదుగా దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, కార్యదర్శి కరిబండి ప్రసాద్‌లు అవార్డును అందుకున్నారు. నగదు బహుమతిగా రూ.20వేలు ఫిక్సడ్ డిపాజిట్‌ను అందజేశారు.

## పేదల ఆరోగ్య భద్రతకే సీఎం సహాయ నిధి : మంత్రి దుర్గేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద ప్రజల వైద్య పరిరక్షణకు సీఎం చంద్రబాబు ప్రత్యేక కృషి చేస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫిశాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని మంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ఈరోజు ఒక్క నిడదవోలు నియోజకవర్గంలో 43మంది లబ్ధిదారులకు వైద్య సేవల నిమిత్తం 30,31,151 రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ఒక ఎన్‌వోసి లెటర్ పంపిణీ చేశారన్నారు. ఇప్పటి వరకు నిడదవోలు నియోజకవర్గంలో 235 మంది లబ్ధిదారులకు 2.14 కోట్ల రూపాయలు సీఎం సహాయనిధి ద్వారా లబ్ధి కలిగించ న్నారు. పేద ప్రజలకు ఆరోగ్యం విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమకు దరఖాస్తు అందిస్తే ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు చర్య లు తీసుకుంటామన్నారు. ప్రతి 15రోజులకు ఒక్కసారి జరుగుతుందని అయన తెలిపారు.

## 'హక్కుల సాధనకు ఉద్యోగులంతా ఏకతాటిపైకి రావాలి'



మండల కార్యాలయంలో టీ తాగుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

కొవ్వూరు, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం కొవ్వూరు తహసీల్దార్ కార్యాలయంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్నిని ర్వహించారు. కొవ్వూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు సుమారు రూ.30 ,000 కోట్లు ఉన్నాయని, డీఏ బకాయిలు, పీఆర్‌సీ కమిటీ వేయాల్సి ఉం దని ఉద్యోగులకు అర్థమయ్యేరీతిలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ పవర్ పాయింటు ప్ర జంటేషన్ ద్వారా వివరించారు. త్వరలో కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలియజేశారు.కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంటు ఎం. కమల్‌సుందర్, కొవ్వూరు తాలూకా యూనిట్ సెక్రటరీ పి.అమరావతి, ట్రెజరర్ రాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గారపాటి అనితా పద్మకుమారి, వైస్ ప్రెసిడెంటు రఘు, మణి, భాగ్యవతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికి నడుం బిగిద్దాం**

**గోపాలపురం:** సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఉద్యోగులు ముక్తకంఠంతో నడుం బిగించాలని తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గిరి ప్రసాద్‌వర్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రండీ టీతాగుతూ మాట్లాడు కుందాం అనే వినూత్న కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏఆర్.సూర్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులంతా టీ తాగుతూ వినూత్నరీతిలో నిరసన వ్యక్తంచేశారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొం టున్న 12డిమాండ్లపై చర్చించారు. గోపాలపురం కార్యదర్శి రాజు, డిప్యూటీ తహసీ ల్దార్ సాంబశివరావు, సర్వేయర్ సత్యనారా యణ, గ్రామ రెవిన్యూ అధికారులు, జిల్లా సహాయఅధ్యక్షుడు సంబర్లిన్ పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి

## ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో చూడండి

● జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారిని డాక్టర్ పద్మ

కొవ్వూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ (పూర్వపు వైద్య విధాన పరిషత్) ఆసుపత్రులలోని ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఫైనల్ సెలెక్షన్ లిస్టుల జాబితాలను ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు ఏపీ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారిని డా.ఎమ్.పద్మ తెలిపారు. జిల్లాలోని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ (పూర్వపు వైద్య విధాన పరిషత్) ఆసుపత్రులలోని ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ నిమిత్తం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పోస్టులకు జిల్లా ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో అప్లికేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈ పోస్టులకు సంబంధించి ఫైనల్ సెలెక్షన్ లిస్టుల జాబితాలను ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. దరఖాస్తుదారులు పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.